


# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | గురువారం 28-05-2026 | సంపుటి - 28 | సంచిక -01 | రూ : 4 | పేజీలు: 8


## మహారాష్ట్ర సీఎంకు ముఖ్యమంత్రి
# రేవంత్ రెడ్డి లేఖ

- తుమ్మిడిహట్టిపై చర్చించేందుకు సిద్ధంగా ఉన్నామన్న రేవంత్ రెడ్డి
- చర్చల కోసం సమయమివ్వాలని లేఖలో విజ్ఞప్తి
- ఎఫ్ఆర్ఎల్ పెరిగినా మహారాష్ట్రలో ముంపు ప్రభావం తక్కువ ఉంటుందని వెల్లడి

హైదరాబాద్: మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌కు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లేఖ రాశారు. తుమ్మిడిహట్టి బ్యారేజీ అంశంపై చర్చించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని ఆ లేఖలో పేర్కొన్నారు. చర్చల కోసం తెలంగాణ రాష్ట్ర ప్రతినిధులకు సమయం ఇవ్వాలని, సమావేశానికి తేదీని ఖరారు చేయాలని విజ్ఞప్తి చేశారు. తుమ్మిడిహట్టి

తరువాయి 2లో



## పల్లె పల్లెకూ టీ-ఫైబర్
# ప్రతి ఇంటికీ హై-స్పీడ్



- ప్రతి ఇంటికీ హై-స్పీడ్ సేవలు
- తక్కువ ధరలకే అందుబాటులోకి టీ-ఫైబర్ పథకం
- ప్రగతి పథంలో కొత్త శకం: వర్క్ ఫ్రమ్ హోమ్ మరియు ఇ-గవర్నెన్స్‌కు ఊతం

హైదరాబాద్, మే 28: డిజిటల్ విప్లవం దిశగా రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. మారుమూల గ్రామాల్లో సైతం అత్యాధునిక సాంకేతిక ఫలాలు అందాలన్న లక్ష్యంతో ప్రతిష్ఠాత్మక 'టీఫైబర్' ప్రాజెక్టును వేగవంతం చేశారు. ఇకపై మారుమూల పల్లెల్లో కూడా పట్టణాలకు దీటుగా హైస్పీడ్ ఇంటర్నెట్ సేవలు అందుబాటులోకి రానున్నాయి.

**సాంకేతికతతో పల్లె బాట..**

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రతి గ్రామాన్ని ఆప్టికల్ ఫైబర్ నెట్‌వర్క్‌తో అనుసంధానం చేయడమే ఈ ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశ్యం. మిషన్ భగీరథ ద్వారా గ్రామాల్లోకి వేసిన పైపులైన్ల గుండానే ఈ ఫైబర్ కేబుళ్లను అమర్చడం వల్ల వ్యయం గణనీయంగా తగ్గింది. ఈ సౌకర్యం

తరువాయి 2లో

# కల్లాల్లో.. 'కళ్లల్లో.. నీళ్లు'

- అకాల వర్షా లతో రైతులకు భారీ నష్టం
- పలు జిల్లాల్లో నీటమునిగిన ధాన్యం
- అన్నదాతలపై అదనపు భారం
- సకాలంలో కొనుగోళ్లు జరగక, సరిపడా టార్పాలిన్లులేక రైతులకు తప్పని అవస్థ

హైదరాబాద్: అన్నదాతలపై ప్రకృతి పగబట్టింది. అకాల వర్షాలతో అతలాకుతలం చేస్తోంది. వరుసగా రెండురోజులపాటు కురిసిన వానలతో వారికి తీవ్రనష్టం వాటిల్లింది. కేంద్రాలకు రాత్రికిరాత్రే

తరువాయి 2లో



## రసవత్తరం..
# 'కర్నాటకం'



- మంత్రులకు నేడు సీఎం సిద్ధరామయ్య విందు
- రాజీనామా చేయొద్దంటూ ఆయనకు అమాత్యులు, ఎమ్మెల్యేల విన్నపాలు
- నాయకత్వ మార్పుపై చర్చ జరగలేదన్న సుర్జేవాలా

2లో



# 'సర్'.. సక్రమమే

- ఎన్నికల సంఘానికి ఆ అధికారం ఉంది
- సుప్రీంకోర్టు కీలక తీర్పు

**దిల్లీ: ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) కసరత్తుపై జరిగిన న్యాయపోరాటంలో ఎన్నికల సంఘాని (ఈసీ)కి**

తరువాయి 2లో

## రక్తచరిత్ర రాసే వాళ్లు..
# స్వర్ణాంధ్ర ఎలా సాధిస్తారు?

- గొడ్డలి పార్టీ అరాచకాల్ని ప్రజలకు పదేపదే చెప్పాలి
- స్థానిక ఎన్నికల్లో గెలవకపోతే నాయకులకు నమస్కారం పెట్టేయడమే
- జెన్‌జీ, ఆల్ఫాకు.. ఆకాశమే హద్దుగా అవకాశాలు
- తెదేపా మహానాడులో చంద్రబాబు స్వాగతోపన్యాసం
- ఘనంగా ప్రారంభమైన వేడుక



2లో

## అంతరిక్ష రంగంలో హైదరాబాద్ సత్తా..
# రీయూజబుల్ ఇంజిన్ పరీక్ష విజయవంతం!

ABYOM

- పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో ఇంజిన్‌ను అభివృద్ధి చేసిన స్టార్టప్ 'అబ్యోమ్'
- అంతరిక్ష ప్రయోగాల ఖర్చును తగ్గించడంలో కీలక ముందడుగు

2లో



## తోటివారికి ఓ గ్లాసు
# నీళ్లివ్వండి...

- పెద్దవారిని బయటకు వెళ్లనీయకండి
- ఎండలతో జాగ్రత్త
- ప్రజలకు ప్రధాని సూచన

దిల్లీ: ఎండలతో అత్యంత అప్రమత్తంగా ఉండాలని దేశ ప్రజలకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సూచించారు. ఈ కఠిన వాతావరణంలో గరిష్ఠ జాగ్రత్తలు ఆవశ్యకమని పేర్కొన్నారు. దేశంలో ఎండలు మండిపోతున్న నేపథ్యంలో బుధవారం

తరువాయి 2లో

# పల్లె పల్లెకూ టీ-ఫైబర్: ప్రతి ఇంటికీ హై-స్పీడ్ ఇంటర్నెట్..

హైదరాబాద్, మే 28: డిజిటల్ విప్లవం దిశగా రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. మారుమూల గ్రామాల్లో సైతం అత్యాధునిక సాంకేతిక ఫలాలు అందాలన్న లక్ష్యంతో ప్రతిష్టాత్మక 'టీఫైబర్' ప్రాజెక్టును వేగవంతం చేశారు. ఇకపై మారుమూల పల్లెల్లో కూడా పట్టణాలకు దీటుగా హైస్పీడ్ ఇంటర్నెట్ సేవలు అందుబాటులోకి రానున్నాయి.

**సాంకేతికతతో పల్లె బాట..**

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రతి గ్రామాన్ని ఆప్టికల్ ఫైబర్ నెట్‌వర్క్‌తో అనుసంధానం చేయడమే ఈ ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశ్యం. మిషన్ భగీరథ ద్వారా గ్రామాల్లోకి వేసిన పైపులైన్ల గుండానే ఈ ఫైబర్ కేబుళ్లను అమర్చడం వల్ల వ్యయం గణనీయంగా తగ్గింది. ఈ సౌకర్యం అందుబాటులోకి రావడం వల్ల గ్రామీణ విద్యార్థులు, రైతులు, మరియు చిన్న తరహా వ్యాపారులకు డిజిటల్ ప్రపంచం చేరువ కానుంది.

**అందుబాటులో అత్యల్ప ధరలకే..**

సామాన్యుడికి భారం కాకుండా, అతి తక్కువ ధరలకే నాణ్యమైన ఇంటర్నెట్ అందించేలా ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ప్రాధాన్యతా క్రమంలో ఈ నెట్‌వర్క్‌తో అనుసంధానించనున్నారు. దీనివల్ల ఇగవర్నెన్స్ సేవలు పారదర్శకంగా, వేగంగా ప్రజలకు చేరనున్నాయి.



**ప్రగతి పథంలో కొత్త శకం..**

హైస్పీడ్ ఇంటర్నెట్ వల్ల గ్రామీణ ప్రాంతాల్లో 'వర్క్ ఫ్రమ్ హోమ్' సంస్కృతికి ఊతం లభించనుంది. అంతేకాకుండా, టెలిమెడిసిన్, ఆన్‌లైన్ విద్య వంటి రంగాల్లో గ్రామాలను స్వయం సమృద్ధం చేసేందుకు ఈ టీఫైబర్ వ్యవస్థ వెన్నెముకగా నిలవనుంది. డిజిటల్ ఇండియాలో తెలంగాణను అగ్రగామిగా నిలపడమే ధ్యేయంగా ప్రభుత్వం ఈ ప్రాజెక్టును యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తోంది.

## మహారాష్ట్ర సీఎంకు
# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లేఖ

హైదరాబాద్ : మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌కు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లేఖ రాశారు. తుమ్మిడిహట్టి బ్యారేజీ అంశంపై చర్చించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని ఆ లేఖలో పేర్కొన్నారు. చర్చల కోసం తెలంగాణ రాష్ట్ర ప్రతినిధులకు సమయం ఇవ్వాలని, సమావేశానికి తేదీని ఖరారు చేయాలని విజ్ఞప్తి చేశారు. తుమ్మిడిహట్టి ప్రాజెక్టుకు 148 మీటర్ల ఎఫ్ఆర్ఎల్‌కు మహారాష్ట్ర ప్రభుత్వం గతంలో అంగీకరించిందని గుర్తు చేశారు. కానీ దీంతో ఉత్తర తెలంగాణ నీటి అవసరాలు తీరవని పేర్కొన్నారు. ఎఫ్ఆర్ఎల్ పెరిగితేనే గ్రావిటీ ద్వారా తెలంగాణకు నీళ్లు వస్తాయని తెలిపారు. ఎఫ్ఆర్ఎల్ పెంచినా మహారాష్ట్రలో ముంపు ప్రభావం తక్కువగానే ఉంటుందని పేర్కొన్నారు.

* **కేంద్రమంత్రితో ముఖ్యమంత్రి భేటీ**

కేంద్రమంత్రి జ్యోతిరాదిత్య సింధియాతో సీఎం రేవంత్ రెడ్డి వర్చువల్ గా భేటీ అయ్యారు. అమెండెడ్ భారత్ నెట్ ప్రోగ్రాం కింద తెలంగాణలో టీఫైబర్ ప్రాజెక్టు అమలుపై చర్చించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి శ్రీధర్ బాబుతో కలిసి పలు కీలక అంశాలను కేంద్రమంత్రి దృష్టికి తీసుకువెళ్ళారు. ప్రతి గ్రామానికి, ప్రతి ఇంటికి బలమైన హైస్పీడ్ ఇంటర్నెట్ అందించాలనే అంశంపై ఈ సమావేశంలో చర్చ జరిగింది. అమెండెడ్ భారత్ నెట్ ప్రోగ్రాం అమలుకు సంబంధిత ఒప్పందాన్ని త్వరితగతిన కుదుర్చుకోవడం, పెండింగ్‌లో ఉన్న నిధుల విడుదల వేగవంతం తదితర అంశాలపై చర్చించారు. మండలం నుంచి గ్రామ పంచాయతీ రింగ్ నెట్ వర్క్ ఆస్తులను డిజిటల్ భారత్ నిధికి బదిలీ చేసేందుకు స్పష్టమైన విధానం ఏర్పాటు చేయడంపై వారు చర్చించారు. తెలంగాణ విజ్ఞప్తులపై సింధియా సానుకూలంగా స్పందించారు. కేంద్రం సహకరిస్తుందని హామీ ఇచ్చారు.

# కల్లాల్లో.. 'కళ్లల్లో.. నీళ్లు'

హైదరాబాద్: అన్నదాతలపై ప్రకృతి పగబట్టింది. అకాల వర్షాలతో అతలాకుతలం చేస్తోంది. వరుసగా రెండురోజులపాటు కురిసిన వానలతో వారికి తీవ్రనష్టం వాటిల్లింది. కేంద్రాలకు రాత్రికిరాత్రే పరుగులు పెట్టి ధాన్యం కుప్పలు, సంచుల వైపు వరద రాకుండా పంటను కాపాడుకునేందుకు ప్రయత్నాలు చేసినా ఫలితం దక్కలేదు. మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, మహబూబ్‌నగర్ సహా పలు జిల్లాల్లో మంగళవారం అర్ధరాత్రి, బుధవారం తెల్లవారుజామున కురిసిన అకాల వర్షంతో ధాన్యం కల్లాలు చిన్నపాటి చెరువులను, కొనుగోలు కేంద్రాలు తటాకాలను తలపించాయి. సరిపడా టార్పాలిన్లు లేకపోవడం, కొన్నిచోట్ల కేంద్రాలు లోతట్టులో ఉండటంతో ధాన్యం తడిసి రైతులకు తీవ్రనష్టం జరిగింది. తడిచిన ధాన్యాన్ని పూర్తిగా కొంటామని ప్రభుత్వం ఇప్పటికే స్పష్టం చేసినప్పటికీ ఆయా కొనుగోలు కేంద్రాల నిర్వాహకుల నుంచి బుధవారం స్పష్టమైన భరోసా రాకపోవడంతో పలుచోట్ల రైతులు ఆందోళనకు దిగారు. కొన్నిచోట్ల తడిచిన ధాన్యాన్ని బాయిల్డ్ రైస్ మిల్లులకు కేటాయించారు. అయితే, సకాలంలో కాంటా వేసి, మిల్లులకు తీసుకెళ్లి ఉంటే సమస్య తీవ్రత తగ్గేది.

* మహబూబ్‌నగర్, వనపర్తి, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో వడ్లు, మక్కలు కొనుగోలు కేంద్రాల్లోనే ఉండటంతో వర్షంతో అన్నదాతలు ఆగమాగమయ్యారు. మహబూబ్‌నగర్ జిల్లాలో 56.7 మి.మీ. సగటు వర్షపాతం నమోదైంది. దేవరకద్ర మండలంలో అత్యధికంగా 139.6 మి.మీ. కురిసింది. మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో 600 టన్నులకుపైగా ధాన్యం తడవడంతో అధికారులు బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలించారు. వనపర్తి జిల్లా పెబ్బేరు మండలం గుమ్మడంలో రైతులు తడిసిన ధాన్యం తక్షణమే కొనాలంటూ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. డీఎస్‌వో కాశీవిశ్వనాథ్ కొనుగోలుకు హామీ ఇవ్వడంతో శాంతించారు. దామెరగిద్దలో పిడుగుపాటుకు కోడె ఎద్దు మృత్యువాత పడింది.
* యాదాద్రిభువనగిరి జిల్లాలోని చౌటుప్పల్, వలిగొండ, సంస్థాన్ నారాయణపురం, తుర్కపల్లి తదితర మండలాల్లో ఆరబోసిన ధాన్యం వర్షానికి తడిచింది.
* మెదక్ జిల్లా తూప్రాన్‌లో కురిసిన వర్షం అన్నదాతలను అతలాకుతలం చేసింది. లారీల కోసం 15 రోజులుగా ఎదురుచూస్తుండగా కురిసిన తాజా వర్షంతో 1,000 క్వింటాళ్లకుపైగా ధాన్యం సంచులు వర్షానికి తడిచాయి. నాగులపల్లిలో లోతట్టు ప్రాంతంలోని కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యాన్ని తీసుకునేందుకు రైతులు అల్లాడారు. అధికారుల నిర్లక్ష్యంతోనే ధాన్యం సేకరణలో జాప్యమైందంటూ రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేశారు.
* పెద్దపల్లి, కరీంనగర్ జిల్లాల్లోనూ పలు మార్కెట్ యార్డులు వరదనీటితో మడులు కట్టాయి. మక్కలు, ధాన్యం కుప్పల చుట్టూ నీళ్లు నిండటంతో రైతులు డబ్బాలు, బకెట్లతో తోడేశారు. ఎప్పటికప్పుడు పంట కొనకపోవడంతోనే తమకు ఊహించని నష్టం జరిగిందని వాపోయారు. మెట్‌పల్లి, రామడుగు, కోరుట్ల, చొప్పదండి మార్కెట్ యార్డుల్లోనూ ధాన్యం వర్షానికి తడిసింది. కొనుగోళ్లలో జాప్యాన్ని నిరసిస్తూ చందుర్తి మండలం మల్యాల గ్రామ అన్నదాతలు కోరుట్ల రహదారిపై బైఠాయించి... నిరసన తెలిపారు.

# రసవత్తరం.. 'కర్నాటకం'

బెంగళూరు: దిల్లీలో మంగళవారం మొదలైన కర్ణాటక రాజకీయం రసవత్తరంగా మారింది. అధిష్ఠానం సూచనతో రాజీనామా చేసేందుకు సిద్ధమైన ముఖ్యమంత్రి సిద్ధరామయ్యపై మంత్రులు, ఎమ్మెల్యేల నుంచి ఒత్తిడి మొదలైంది. వీరంతా బుధవారం ఉదయం నుంచే బెంగళూరులోని ముఖ్యమంత్రి అధికార నివాసం 'కావేరి'కి చేరుకుని రాజీనామా చేయొద్దని విన్నవించారు. అయితే తన నిర్ణయాన్ని వెనక్కు తీసుకోనని ముఖ్యమంత్రి తేల్చి చెబుతున్నారు. గురువారం ఉదయం 9 గంటలకు అల్పాహార సమావేశానికి హాజరు కావాలని ఇప్పటికే మంత్రులందరికీ ఆయన కార్యాలయం నుంచి సమాచారం పంపారు. గురువారం ఉదయం 10.30 గంటలకు గవర్నర్ అపాయింట్‌మెంట్ ఇవ్వాలంటూ ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి వర్తమానం వెళ్లిందన్న వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. దీనిపై గవర్నర్ ఇంత వరకూ స్పందించలేదు. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి, కాంగ్రెస్ కర్ణాటక వ్యవహారాల ఇన్‌ఛార్జి రణ్‌దీప్ సింగ్ సుర్జేవాలా ఇప్పటికే బెంగళూరు చేరుకున్నారు. దిల్లీలోనే ఉన్న ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ గురువారం నేరుగా ముఖ్యమంత్రి నిర్వహించే అల్పాహార సమావేశానికి హాజరవుతున్నట్లు అధికారికంగా వెల్లడించారు.

**మీడియాలో మాత్రమే చర్చ: రణ్‌దీప్**

'దిల్లీలో కేవలం రాజ్యసభ, ఎమ్మెల్సీ ఎన్నికల గురించే చర్చించాం. కర్ణాకటలో నాయకత్వ మార్పుపై ఎలాంటి చర్చ జరగలేదు' అని రణ్‌దీప్ సింగ్ సుర్జేవాలా బుధవారం బెంగళూరులో మరోసారి స్పష్టం చేశారు. 'మీడియాలో మాత్రమే ఇలాంటి చర్చలు కొనసాగుతున్నాయి. రేపు, 20 రోజులు, 6 నెలల తర్వాత ఏం జరుగుతుందో మేం ఎలా చెప్పగలం?' అని విలేకరులను ఎదురు ప్రశ్నించారు. మేం ఇప్పటి వరకు కాంగ్రెస్ శాసనసభ పక్ష సమావేశంపై ఎలాంటి ప్రకటన చేయలేదన్నారు.

**డీకే ఇంటి వద్ద సంబరాలు**

ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ నివాసం వద్ద అభిమానులు సంబరాలు చేసుకున్నారు. మతాబులు పేల్చి, స్వీట్లు పంచుతూ 'కొత్త సీఎం' అంటూ నినదిస్తూ కేరింతలు కొట్టారు. రాష్ట్రం నలుమూలల నుంచి పలువురు సిద్ధరామయ్య అభిమానులు ఆయన నివాసానికి చేరుకుని సీఎం పదవి నుంచి సిద్ధరామయ్యను తొలగిస్తే పార్టీ పతనమవుతుందని హెచ్చరిస్తున్నారు. సిద్ధరామయ్యను తొలగిస్తే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేపడతామని కర్ణాటక అల్పసంఖ్యాక, హిందళిద, దళిత సంఘం అధ్యక్షుడు రామచంద్రప్ప హెచ్చరించారు. రాజీనామా చేయొద్దని చెప్పినా సీఎం మౌనంగా ఉన్నారని మంత్రి హెచ్.కె.పాటిల్ తెలిపారు. మాజీ మంత్రి ఆర్.వి.దేశ్‌పాండే మాట్లాడుతూ ముఖ్యమంత్రి రాజీనామా చేసేందుకు సిద్ధంగా ఉన్నారని, రేపు రాజీనామా చేయొచ్చని వివరించారు. సీఎంగా డీకే శివకుమార్‌కు అవకాశమిస్తే ఎవరు ఉప ముఖ్యమంత్రి కావాలనే అంశంపై ఇప్పటికే పార్టీలో సమీకరణాలు మొదలయ్యాయి. మంత్రి జమీర్ అహ్మద్ ఇంట్లో అహింద నేతలంతా సమావేశమై డిమాండ్ల గురించి చర్చించుకున్నారు. కేపీసీసీ అధ్యక్ష పీఠంపై ఆసక్తి చూపుతున్న మంత్రి సతీశ్ జార్కిహొళి స్పందిస్తూ.. ముఖ్యమంత్రి ఇచ్చే అల్పాహార సమావేశంలో అసలు విషయం బయటపడుతుందన్నారు.

# రక్తచరిత్ర రాసే వాళ్లు.. స్వర్ణాంధ్ర ఎలా సాధిస్తారు?

అమరావతి: రక్తచరిత్ర రాసేవారు స్వర్ణాంధ్ర ఎలా సాధించగలరని తెదేపా అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రశ్నించారు. వైకాపా పాలనలో రాష్ట్రాభివృద్ధిపై గొడ్డలివేటుతో జరిగిన నష్టాన్ని ప్రజలకు మళ్లీ మళ్లీ వివరించడంతోపాటు, ఆ పార్టీ నైజాన్ని ఎండగట్టాల్సిన బాధ్యత కార్యకర్తలు, నేతలదేనని సూచించారు. తెలుగుదేశంలో ఏ స్థాయి నాయకుడికైనా పార్టీయే ముఖ్యమని.. క్యాడర్, క్యాడర్, క్యాడర్ అనే లక్ష్యంతోనే పనిచేయాలని స్పష్టం చేశారు. 'ఎమ్మెల్యేలు, ఎంపీలే నాయకులు కాదు.. బూత్‌స్థాయిలోని ప్రతి కార్యకర్తా నాయకుడే. మనం తయారు చేయాల్సింది అనుచరుల్ని కాదు.. నాయకుల్ని. కార్యకర్తల్ని గౌరవంగా చూసుకోవాలి. వారికి సముచిత స్థానం కల్పించాలి. ఎవరు విస్మరించినా ఉపేక్షించేది లేదు' అని తేల్చిచెప్పారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయం వేదికగా 1,875 క్లస్టర్లను అనుసంధానిస్తూ హైబ్రిడ్ విధానంలో రెండు రోజులపాటు నిర్వహించే మహానాడును బుధవారం ప్రారంభిస్తూ చంద్రబాబు స్వాగతోపన్యాసం చేశారు. విద్య, ఉద్యోగాలతోపాటు స్థానిక సంస్థల్లో మహిళలకు రిజర్వేషన్లు తెచ్చామని.. మోదీ నాయకత్వంలో చట్టసభల్లోనూ మహిళలకు 33% రిజర్వేషన్లు సాధిస్తామని మహిళలకు హామీ ఇచ్చారు. కూటమి విజయంలో మహిళలదే కీలక పాత్రని, ఈ మహానాడును ఆడబిడ్డలకే అంకితం చేస్తున్నామని ప్రకటించారు.

* **మారింది మీటింగ్ విధానమే..**
**కార్యకర్తల జోరు కాదు**

పశ్చిమాసియా యుద్ధం నేపథ్యంలో పొదుపుపై బాధ్యత కలిగిన పార్టీగా మహానాడును హైబ్రిడ్ మోడల్‌లో వర్చువల్, ఫిజికల్‌గా నిర్వహిస్తున్నాం. మారింది మీటింగ్ విధానమే..అయినా అన్ని విషయాలూ చర్చిస్తాం. ఫలితాలు సమీక్షిస్తాం. భవిష్యత్తు ప్రణాళికలు ప్రకటిస్తాం. హైబ్రిడ్ విధానంలో 1,875 క్లస్టర్లను అనుసంధానించాం. ప్రారంభం రోజే లక్షల మంది పాల్గొని అదరగొట్టారు. వర్చువల్ మహానాడు కారణంగా వాహనాల హోరు మాత్రమే తగ్గింది.. తెదేపా కార్యకర్తల్లో జోష్ ఏ మాత్రం తగ్గలేదు.

**వైకాపా ఒక బ్లఫ్ బ్యాచ్**

వైకాపా హయాంలో విశాఖ రైల్వేజోన్‌కు 52 ఎకరాలు ఇవ్వలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక భూమి ఇచ్చి, జోన్ సాధించాం. విశాఖ ఉక్కు మన సెంటిమెంట్.. కేంద్రం సాయంతో దాన్ని నిలబెట్టాం.

సీమకు ఐదేళ్లు తీరని ద్రోహం చేశారు. అనుమతులు తీసుకురాలేక రాయలసీమ ఎత్తిపోతల పనులు నిలిచిపోతే.. దానిపైనా ప్రజల్ని తప్పుదోవ పట్టిస్తున్నారు.

వైకాపాకు రాజధానిపై విజన్ లేదు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అమరావతికి మద్దతిస్తామన్నారు. అధికారంలోకి వచ్చాక మూడు రాజధానులు అన్నారు. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం చట్టం చేశాక కూడా మావిగన్ అంటున్నారు.

వైకాపా ఒక బ్లఫ్ బ్యాచ్.. ఫేక్ న్యూస్ ప్రచారం తప్ప మరేమీ చేతకాదు. రాజకీయ పార్టీ ముసుగులో గొడ్డలి పార్టీ చేస్తున్న కుట్రలను ఆదిలోనే అడ్డుకోవాలి. ఎండగట్టాలి.

ప్రజలందరికీ భరోసా కల్పించే పసుపు పండగగా మహానాడు నిర్వహిస్తుంటే.. వైకాపా నాయకుడు మీటింగ్ పెట్టి ప్రజల దృష్టి మళ్లించే కుట్రలు చేస్తున్నారు.

# తోటివారికి ఓ గ్లాసు నీళ్లివ్వండి

దిల్లీ: ఎండలతో అత్యంత అప్రమత్తంగా ఉండాలని దేశ ప్రజలకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సూచించారు. ఈ కఠిన వాతావరణంలో గరిష్ఠ జాగ్రత్తలు ఆవశ్యకమని పేర్కొన్నారు. దేశంలో ఎండలు మండిపోతున్న నేపథ్యంలో బుధవారం ఆయన ఎక్స్ వేదికగా ప్రజలకు పలు సూచనలు చేశారు. 'దేశంలోని పలు ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు గరిష్ఠ స్థాయికి చేరుకున్నాయి. ఈ తీవ్ర ఎండలవల్ల పిల్లలు, పెద్దవారు, బహిరంగ ప్రదేశాల్లో పని చేస్తున్నవారు వెంటనే ప్రభావితమయ్యే అవకాశముంది. వేడివల్ల వచ్చే అలసట త్వరగా ప్రమాదకరంగా మారుతుంది. అది వడదెబ్బకు దారితీస్తుంది. అందువల్ల అన్ని జాగ్రత్తలు తీసుకోవాలి' అని ప్రధాని సూచించారు.

* ప్రతి ఒక్కరూ నీరు తాగుతూ ఉండాలి. బయటకు వెళ్లేటప్పుడు తాగునీరు తీసుకెళ్లాలి. తోటివారికి ఓ గ్లాస్ తాగునీరు ఆఫర్ చేయాలి.
* తల తిరగడం, వికారం, తీవ్రమైన అలసట వంటి వడదెబ్బ లక్షణాలను గమనిస్తూ ఉండాలి. ఎవరైనా అలసటగా, తలనొప్పితో ఉంటే వెంటనే వారిని చల్లని ప్రదేశానికి తరలించండి. వెంటనే తాగు నీరు, ఓఆర్ఎస్ వంటివి అందించండి.
* వృద్ధ తల్లిదండ్రులను, తాత, అమ్మమ్మ, నాన్నమ్మలను గమనిస్తూ ఉండండి. తాగునీరు తీసుకుంటూ ఉండాలని వారికి చెప్పండి. మధ్యాహ్నం సమయంలో బయటకు వెళ్లనీయకండి. అవసరమైనంత సమయం విశ్రాంతి తీసుకోవాలని సూచించండి.

# 'సర్'.. సక్రమమే

దిల్లీ: ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) కసరత్తుపై జరిగిన న్యాయపోరాటంలో ఎన్నికల సంఘాని(ఈసీ)కి భారీ విజయం లభించింది. బిహార్‌లో చేపట్టిన సర్ కసరత్తు రాజ్యాంగబద్ధమేనని, ఆ అధికారం ఈసీకి ఉందని సుప్రీంకోర్టు బుధవారం తేల్చిచెప్పింది. చట్టాలను ఈసీ అతిక్రమించిందన్న వాదనలకు తిరస్కరిస్తూ 124 పేజీల తీర్పును వెలువరించింది. రాష్ట్రాలలో 'సర్' నిర్వహణ ఆవశ్యకతపై ఈసీ తెలిపిన కారణాలను సమర్థించింది. సుప్రీంకోర్టు తీర్పుతో విపక్ష కాంగ్రెస్ పార్టీ విభేదించింది. దేశవ్యాప్తంగా తీవ్ర చర్చకు దారితీసిన వివాదాస్పద 'సర్' కసరత్తుపై సుదీర్ఘ విచారణ అనంతరం సుప్రీంకోర్టు ధర్మాసనం నిర్ణయం వెలువరించింది. నిష్పక్షపాతంగా, స్వేచ్ఛగా, న్యాయబద్ధంగా ఎన్నికలు నిర్వహించాలన్న రాజ్యాంగ ఆదేశాలను 'సర్' ముందుకు తీసుకెళ్తుందని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీ ధర్మాసనం అభిప్రాయపడింది. ఓటరు జాబితాలో పేరును తొలగించినంత మాత్రాన దేశ పౌరసత్వాన్ని కోల్పోయినట్లు కాదని తీర్పు రాసిన సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ పేర్కొన్నారు. ఓటర్ల జాబితా...పౌరసత్వాన్ని నిర్ధారించే చట్టబద్ధమైన పత్రమేమీ కాదని తెలిపారు. రాజ్యాంగ అధికరణం 324, ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 21(3) ప్రకారం.. ఓటరు జాబితాలకు ప్రత్యేక సవరణలు చేపట్టే అధికారం ఎన్నికల సంఘానికి దఖలుపడ్డాయని స్పష్టం చేసింది. బిహార్‌లో 'సర్' కసరత్తును సవాల్‌చేసిన పిటిషన్లను ధర్మాసనం తోసిపుచ్చింది. సాధారణ ఓటర్ల జాబితా సవరణ కంటే సర్ భిన్నంగా ఉన్నంత మాత్రాన దీనిని కొట్టివేయలేమని, ఇది పూర్తిగా రాజ్యాంగబద్ధమైనది, చట్టబద్ధమైనదని స్పష్టం చేసింది. మొదట్లో ఎక్కువ మందిని ఓటరు జాబితా నుంచి తొలగించేదిగా సర్ కనిపిస్తుంది. తగిన రక్షణ చర్యల ద్వారా దీనిని సరిగ్గా రాజ్యాంగబద్ధంగా నిర్వహించవచ్చు. ఈసీ తన పరిధి దాటి వ్యవహరించలేదని పేర్కొంది. 'సర్' నిర్వహణ ఆవశ్యకతపై ఈసీ తెలిపిన..నగరీకరణ, భారీ వలసలు, సమగ్ర సవరణ చేపట్టి రెండు దశాబ్దాలు గడవటం..వంటి కారణలపై ధర్మాసనం సంతృప్తి వ్యక్తం చేసింది.

# అంతరిక్ష రంగంలో హైదరాబాద్ సత్తా..
## రీయూజబుల్ ఇంజిన్ పరీక్ష విజయవంతం!

భారత అంతరిక్ష రంగంలో హైదరాబాద్‌కు చెందిన స్పేస్‌టెక్ స్టార్టప్ 'అబ్యోమ్ స్పేస్‌టెక్ & డిఫెన్స్' ఒక కీలక మైలురాయిని అందుకుంది. పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన రీయూజబుల్ లిక్విడ్ రాకెట్ ఇంజిన్ క్వాలిఫికేషన్ టెస్ట్‌ను విజయవంతంగా పూర్తి చేసినట్లు సంస్థ ప్రకటించింది. ఈ విజయం, అంతరిక్ష ప్రయోగాల వ్యయాన్ని గణనీయంగా తగ్గించే సాంకేతికతలో భారత్ ముందడుగు వేయడానికి దోహదపడనుంది. కంపెనీకి చెందిన కమర్షియల్ టెస్ట్ ఫెసిలిటీలో ఈ పరీక్షలు నిర్వహించారు. ఈ విజయం, త్వరలో చేపట్టనున్న 'హోప్' (వర్టికల్ టేకాఫ్ అండ్ వర్టికల్ ల్యాండింగ్) అనే పునర్వినియోగ రాకెట్ ప్రాజెక్టుకు, అలాగే క్రయోజెనిక్ ఇంజిన్ అభివృద్ధికి ఎంతగానో సహాయపడుతుందని కంపెనీ ప్రతినిధులు తెలిపారు. ఈ పరీక్షల్లో వాడిన ఇంజిన్ సిస్టమ్స్, కంట్రోల్ ఆర్కిటెక్చర్ సహా అన్ని పరికరాలను తమ ఇంజనీరింగ్ బృందమే దేశీయంగా తయారు చేసిందని అబ్యోమ్ వెల్లడించింది. ఈ విజయంపై సంస్థ వ్యవస్థాపకుడు, సీఈవో జైనుల్ అబిదీన్ మాట్లాడుతూ "భారత్‌లో స్వదేశీ పునర్వినియోగ ప్రొపల్షన్ వ్యవస్థల నిర్మాణంలో ఈ పరీక్షలు చాలా కీలకం. అంతరిక్ష ప్రయోగాల ఖర్చును భారీగా తగ్గించడంలో ఇవి సహాయపడతాయి. తక్కువ ఖర్చుతో కూడిన రీయూజబుల్ స్పేస్‌ఫ్లైట్ కోసం టెక్నాలజీని మరింత ముందుకు తీసుకెళ్తున్నాం" అని వివరించారు. బిట్స్ పిలానీ హైదరాబాద్ క్యాంపస్ ఇంక్యుబేటర్ నుంచి అబ్యోమ్ స్టార్టప్ ప్రారంభమైంది. ఈ సంస్థకు ఐఐటీ మద్రాస్, ఐఐటీ బాంబేతో పాటు డీఎస్‌టీ, ఇస్రో, మెయిటీ వంటి ప్రభుత్వ సంస్థల నుంచి కూడా మద్దతు లభిస్తోంది.

# సేవాభవానికి ప్రతిరూపం బక్రీద్ పండుగ

* **ముస్లిం సోదరులకు బక్రీద్ పర్వదిన శుభాకాంక్షలు తెలిపిన మంత్రి**



హుస్నాబాద్ ,ప్రజాస్ఫూర్తి : ముస్లిం సోదర సోదరీమణులకు మంత్రి పొన్నం ప్రభాకర్ పవిత్ర బక్రీద్ పర్వదిన శుభాకాంక్షలు తెలియజేశారు.త్యాగం, సేవా భావం, మానవతా విలువలకు ప్రతీకగా నిలిచే బక్రీద్ పండుగ సమాజంలో సోదరభావం, పరస్పర గౌరవాన్ని మరింత బలోపేతం చేస్తుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ శాంతి సామరస్య వాతావరణంలో పండుగను ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.తెలంగాణ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం కట్టుబడి పనిచేస్తోందన మైనారిటీ సోదరుల అభ్యున్నతికి సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో పలు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామని మంత్రి తెలిపారు.ఈ బక్రీద్ పర్వదినం రాష్ట్ర ప్రజలందరి జీవితాల్లో సుఖశాంతులు ఆయురారోగ్యాలు నింపాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆకాంక్షించారు.

# మహిళా భద్రత,ఆర్థిక సాధికారత కు ప్రాధాన్యం


* **జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా.**




జనగామ, ప్రజాస్ఫూర్తి : జిల్లా లో ప్రజా పాలన,ప్రగతి ప్రణాళిక 99 కార్యక్రమా ల నేపథ్యంలో మహి ళా భద్రత, రక్షణ వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ లో పని ప్రదేశాల్లో మహిళల పై లైంగిక వేధింపుల నిరోధక చట్టం 2013 పై మహిళా ఉద్యోగులకు అవగాహన కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, మున్సిపల్ చైర్‌పర్సన్ కడకంచి బాలమణి, అదనపు కలెక్టర్, డీడబ్ల్యూఓ బెన్ షా లోమ్ ప్రారంభించా రు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడు తూ మహిళలకు కార్యాలయాల్లో భయ రహిత, గౌరవప్రదమైన వాతావరణం కల్పించడం ప్రతి సంస్థ బాధ్యత అని పేర్కొన్నారు. ప్రతి కార్యాలయంలో ఇం టర్నల్ కంప్లైంట్స్ కమిటీ తప్పనిసరిగా ఉండాలని, వేధింపులకు గురైన మహిళ లు మౌనం పాటించకుండా చట్టపరమై న రక్షణను వినియోగించుకో వాలని సూచించారు. షి బాక్స్ పోర్టల్ ద్వారా మహిళలు నేరుగా ఫిర్యాదు చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. మహిళల భద్రత, గౌరవం సమాజ అభివృద్ధికి కీల కమని మున్సిపల్ చైర్‌పర్సన్ కడకంచి బాలమణి పేర్కొనగా,జిల్లా లోని కమిటీ లను అప్డేట్ చేయాలని అదనపు కలెక్ట ర్ బెన్ షా లోమ్ అధికారులకు సూచిం చారు.అనంతరం జిల్లా లోని స్టేషన్ ఘనపూర్ నియోజక వర్గం, రఘునాథపల్లి మండలం అశ్వరా వుపల్లి గ్రామంలో గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఇందిరా మహిళా శక్తి సౌర విద్యుత్ ప్లాంట్ శంకుస్థాపన కార్యక్ర మం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, గ్రంథాలయ ఛైర్మన్ మారుజోడు రాంబాబు హాజరై నవ భారతి మండల మహిళా సమాఖ్యకు కేటాయించిన ఒక మెగావాట్ సౌర విద్యుత్ ప్లాంట్‌కు శంకుస్థాపన చేశారు.

# గ్రామ పంచాయతీలకు ప్రత్యేక నిధులు కేటాయించండి

* **రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ ను కలిసిన బిఆర్ఎస్ సర్పంచులు.**



హుస్నాబాద్, ప్రజాస్ఫూర్తి : గ్రామ పంచాయతీల అభివృద్ధికి తోడ్పాటు అందించి ప్రత్యేక నిధులు కేటాయించి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపే విధంగా కృషి చేయాలని కోరుతూ రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి స్థానిక ఎమ్మెల్యే పొన్నం ప్రభాకర్ ను అక్కన పేట బి ఆర్ ఎస్ పార్టీ సర్పంచ్ లు బుధవారం మినిస్టర్ క్వార్టర్స్ లో కలిశారు.అనంతరం అక్కన్నపేట మండల సర్పంచ్లు ఫోరం అధ్యక్షులు భూక్య కృష్ణ నాయక్ మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యేగా మంత్రిగా ఉన్నటువంటి పొన్నం ప్రభాకర్ ను మర్యాదపూర్వకంగా కలవడం జరిగిందని అంతే తప్ప వీరిలో వేరే ఉద్దేశం లేదని ఆయన అన్నారు. గ్రామాలు అభివృద్ధి చెందాలంటే ప్రభుత్వం తోడ్పాటు అందించాలని, గ్రామాలకు ప్రత్యేక నిధులు కేటాయించాలనే ఉద్దేశంతోటి మంత్రి ని కలవడం జరిగిందని,అనేక గ్రామ పంచాయతీలకు పక్కా భవనాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని అంగన్వాడి సెంటర్లకు కూడా పక్కా భవనాలు లేక పిల్లలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని అటు తండాలలో కూడా రోడ్ల సౌకర్యం సరిగ్గా లేదని వాటికి కూడా నిదులు కేటాయించాలని అన్ని విధాలుగా నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే గ్రామాలలో ఉన్న సమస్యలు తీర్చినట్లయితే మరింత ముందుకు వెళ్లే వీలుంటుందని అందుకు రాష్ట్ర మంత్రి పొన్నం ను కలవడం జరిగిందని కృష్ణ నాయక్ అన్నారు దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించాడని అభివృద్ధికి తోడ్పాటు అందిస్తారని హామీ ఇచ్చినట్లు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కట్కూర్ సర్పంచ్ బాలరాజు, జనగాం సర్పంచ్ బొడ్డు ఈశ్వర్,కేశవ్ నాయక్ తండా సర్పంచ్ లావుడియా సులోచన దేవన్ నాయక్,మాలోతు మనీ కనుక నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# బంధువులే ఇంటి దొంగలు



* **మహిళా మేడలో నుంచి పుస్తెలతాడు కమ్మలు చోరీ చేసిన నిందితురాలి అరెస్టు**

హుస్నాబాద్, ప్రజాస్ఫూర్తి : హుస్నాబాద్ మండలం పోతారం (యస్) గ్రామంలో ఇంటి ముందు వరండా లో నిద్రిస్తున్న మహిళా మెడ లో నుండి బంగారు పుస్తెల తాడు, చెవి కమ్మలు మరియు చైన్ గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెల్లినారని సమాచారం రాగా హుస్నాబాద్ యస్. ఐ. లక్ష్మా రెడ్డి తన సిబ్బంది తో నేర స్థలానికి వెళ్లి అక్కడే భాదితురాలు బొయిని మంజుల నుండి ధరఖాస్తు తీసుకొని కేసు నమోదు చేసి విచారించగా విచారణలో బాధితురాలి యొక్క స్వంత చెల్లె అయిన బొయిని విజయ భారతి మరియు ఆమె నాల్గవ అక్క కూతురు (మైనరు) సహాయంతో భాదితురాలు ఇంటి ముందు వరండాలో గాడ నిద్రలో ఉన్న సమయంలో అర్ధరాత్రిర సమయంలో వైరు కట్టర్ ద్వారా బాధితురాలి యొక్క మెడలో ఉన్న బంగారు పుస్తెల తాడు, బంగారు చైన్ కట్ చేసి తర్వాత ఎవరికీ అనుమానం రాకుండా బయటి వాళ్ళు ఎవరో దొంగతనం చేసినట్లు నమ్మించడానికి నాల్గవ అక్క కూతురు (మైనరు) యొక్క చెవి కమ్మలు కూడా తీసి మొత్తం కలిపి ప్లాస్టిక్ కవర్ లో పెట్టి ఇంటి ముందు ఉన్న లంద గోళం కింద దాచి పెట్టినట్లు తేలగా నిందితురాలని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు.కేసును త్వరగా చేదించడంలో ప్రతిభ కనబర్చిన హుస్నాబాద్ సి.ఐ. కొండ్రు శ్రీను యస్.ఐ. పాకాల లక్ష్మా రెడ్డి మరియు సిబ్బంది కానిస్టేబుల్ నీలం సంపత్, నంగునూరి నరేష్‌లను హుస్నాబాద్ ఎ.సి.పి. సౌడారపు సదానందం అభినందించారు.

# జల దోపిడిలో భాగమే " లిఫ్ట్ కుట్రలు"

* **జీవో నెం. 98ని తక్షణమే రద్దు చేయాలి!**



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : గార్ల మండలాన్ని ఎడారిగా మార్చే ప్రతిపాదిత మున్నేరు పాలేరు లింకు కెనాల్ కు అనుకూలమని పేర్కొంటూ,గార్ల మండల సాగునీటి అవసరాల కోసం మున్నేరుపై లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటు చేయాలని కోరుతూ ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి లేఖ ఇవ్వడం గార్ల మండల ప్రజలను, రైతులను మాయ మాటలతో మభ్య పెట్టడానికేనని తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు, ప్రముఖ న్యాయవాది విశ్వ జంపాల అన్నారు. బుధవారం గార్ల మండల కేంద్రంలో మీడియాకు విశ్వ జంపాల ఒక ప్రకటన విడుదల చేశారు. ఆయన ప్రకటనలోని సారాంశం.మున్నేరు పాలేరు లింకు కెనాల్ నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ గార్ల మండలంలో కొనసాగుతున్న ప్రజా ఉద్యమాలను నీరుగార్చే కుట్రలో భాగంగానే ఈ లేఖలు ముందుకొస్తున్నాయని ఆయన ఆరోపించారు. గార్ల మండలంలో పార్టీలకతీతంగా, కులమతాలకతీతంగా అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, రైతులు ఏకమై మున్నేరుపాలేరు లింక్ కెనాల్ కు వ్యతిరేకంగా చారిత్రాత్మక ఉద్యమం చేస్తుంటే, ప్రభుత్వం కనీసం పట్టించుకోకపోవడం దుర్మార్గం అన్నారు. ప్రజా నిరసనల తీవ్రతను పక్కదారి పట్టించడానికి, ప్రజల్లో గందరగోళం సృష్టించడానికి 'లిఫ్ట్ ఇరిగేషన్' అనే కొత్త రాగాన్ని అందుకున్నారని విశ్వ పేర్కొన్నారు.ఇది కేవలం ఉద్యమాన్ని నీరుగార్చడానికి పన్నుతున్న కుట్ర మాత్రమే. ఒకపక్క వందల ఎకరాల భూ సేకరణకు సర్వం సిద్ధం చేస్తూ, ఇంకోవైపు లిఫ్ట్ కడతాం అనడం పచ్చి మోసం కాదా? అని ఆయన ప్రశ్నించారు. గార్ల మండల భూములను ఎడారిగా మార్చే ఏ ప్రాజెక్టునైనా ప్రాణాలు అడ్డుపెట్టయినా అడ్డుకుంటాం ఆయన హెచ్చరించారు. ఇప్పటికే మున్నేరుపై ఉన్న పలు గ్రామాల లిఫ్టులు గత 20 సంవత్సరాలుగా పనిచేయకుండా పడావు బడి ఉన్నాయని ఆయన అన్నారు. నేటి ప్రభుత్వాలు చిన్నచిన్న లిఫ్టులను సహితం నిర్వహించలేని పరిస్థితిలో ఉండడం కారణంగా ఇక్కడి రైతాంగం సాగునీటి అవసరాల కోసం తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని విశ్వ గుర్తు చేశారు. పడావుపడ్డ లిఫ్టులను పట్టించుకోని ప్రభుత్వాన్ని కొత్త లిఫ్ట్ లను ఏర్పాటు చెయ్యమని కోరడం గార్ల మండల ప్రజలను ఏమార్చి మున్నేరు నీళ్లను ఇతర ప్రాంతాలకు తరలించాలని ప్రయత్నించడమేనని ఆయన అన్నారు.



# ప్రభుత్వ ఆసుపత్రి పేద ప్రజల ఆస్తి

మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి ఇది ప్రజల ఆస్తి అని ఇందులో పని చేసే ప్రతి వైద్యుడు ప్రజలకు జవాబుదారితనంగా ఉండాలని ఎమ్మెల్యే మురళి నాయక్ వైద్య సిబ్బందికి హెచ్చరించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని జిల్లా ఆస్పత్రిని ఎమ్మెల్యే మురళి నాయక్ ఆకస్మిక తనిఖీ చేశారు.ఈ సందర్భంగా పలు వార్డులలో పర్యటించి రోగులకు అందుతున్న వైద్య సేవలపై అరాతీశారు.ఈ సందర్భంగా పలువురు రోగులు వైద్యులు సమయానికి రావడం లేదని పట్టించుకోవడంలేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దీనికి ఆయన స్పందిస్తూ వైద్యులతో రివ్యూ మీటింగ్ ఏర్పాటు చేశారు. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే పేద మధ్యతరగతి కుటుంబాలకు ఇబ్బంది కలిగితే చర్యలు తప్పవనన్నారు. లక్షల రూపాయలు జీతాలను ప్రజలు చెల్లిస్తున్న పన్ను ద్వారా తీసుకుంటు ఎందుకు ప్రజలకు సేవ చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మందలించారు. గత పదేళ్లలో విద్య, వైద్యం పూర్తిగా కుంటుపడిందని దీంతో ఎంతోమంది పేద బడుగు బలహీన వర్గాలు విద్యకు దూరమయ్యారని వైద్యం అందక ప్రభుత్వ దవఖానలో సరైన మెరుగైన సౌకర్యాలు లేక నానాఇబ్బంది పడ్డారని ఎమ్మెల్యే ఆవేదన వ్యక్తం చేశారు. మానుకోట జిల్లాలో 300 పడకల ఆసుపత్రి, డైలసి సెంటర్, మెడికల్ హబ్ గా తీర్చిదిద్దేందుకు ఇలా ఎన్నో రకాల వైద్యసాదుపాయాల కోసం కోట్లాది రూపాయలు ప్రభుత్వం కేటాయించిందని గుర్తు చేశారూ. స్టాఫ్ నర్సులు, ఇతర వైద్య సిబ్బంది రోగుల పట్ల అటెండెన్స్ పట్ల దురుసుగా వ్యవహరిస్తున్నారని పలువురు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా దీనిపై ఎమ్మెల్యే నర్సింగ్ స్టాఫ్ ను నిలదీశారు.పేద ప్రజల రోగులపై అలసత్వం వహించిన నిర్లక్ష్యం వహించిన ఉద్యోగాలు పోతాయని ఆయన అన్నారు. స్వయంగా ఎమ్మెల్యే మెడలో స్టెతస్కోప్ వేసుకొని పలువురికి వైద్య సేవ నిర్వహించారు

# ఎస్ఐఆర్ మ్యాపింగ్ వేగవంతం చేయాలి

* **జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా.**

జనగామ, ప్రజాస్ఫూర్తి : ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) మ్యాపింగ్ ప్రక్రియ ను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ బెన్ షా లోమ్ ఆర్డీఓ లు, తహసీల్దార్లతో కలిసి పురోగతిని సమీక్షించారు. జిల్లాలోని 23 మండలా ల్లో ప్రతి మండలానికి 250 ఓటర్ల మ్యా పింగ్ పూర్తి చేయాలని సూచించారు. ఫారం 6, 7, 8 ద్వారా వచ్చిన దరఖాస్తు లను త్వరగా పరిశీలించి, మరణించిన, బదిలీ అయిన ఓటర్ల వివరాలను నవీ కరించాలని ఆదేశించారు.



* **ఉపాధి హామీ పనుల్లో లక్ష్యాలు సాధించాలి...**

ఉపాధి హామీ కింద ఎక్కువ మంది కూలీలకు పని కల్పించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధి కారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ లో నిర్వహించిన సమీక్ష సమా వేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధి హామీ పనులు పెంచాలి, పెండింగ్ నిర్మా ణాలు త్వరగా పూర్తి చేయాలి. చిన్న మండలాల్లో కనీసం 5 వేల మంది, పెద్ద మండలాల్లో 7 వేల మంది కూలీలకు పని కల్పించేలా పనులు సిద్ధం చేయాల ని ఎంపీడీఓలకు సూచించారు. అంగన్ వాడీ, వీఓ, జీపీ భవనాల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని, ఇందిరమ్మ ఇళ్ల గ్రీవెన్స్ దరఖాస్తులు క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదికలుఅందించాలని ఆదేశించారు.సమావేశంలో పంచాయ తీరాజ్ శాఖ అధికారులు, ఎంపీడీఓలు,ఎంపీఓలు,సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# జూన్ 5, 6,7 న థ్రెడ్ పోచంపల్లి హ్యాండ్లూమ్ పేరుతో భారీ వస్త్ర ప్రదర్శన

* **మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ని ఆహ్వానించిన జిల్లా కలెక్టర్**



భువనగిరి, ప్రజాస్ఫూర్తి : జిల్లా చేనేత కార్మికుల ఉత్పత్తులకు మెరుగైన మార్కెట్ సౌకర్యం కల్పించుటకు జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి ప్రత్యేక చొరవ తీసుకొని, హైదరాబాద్‌లోని హైటెక్స్ ప్రాంగణంలో జూన్ 5, 6, 7 తేదీలలో "థ్రెడ్. పోచంపల్లి హ్యాండ్లూమ్ ఎగ్జిబిషన్" పేరుతో భారీ వస్త్ర ప్రదర్శన , అమ్మకాల మేళాను నిర్వహించనున్నారు.ఈ ప్రదర్శనలో 100 చేనేత స్టాల్స్‌తో పాటు అనుబంధంగా శ్రీశక్తి సంఘాలకు సంబంధించిన స్టాల్స్ కూడా ఏర్పాటు చేయబడనున్నాయి. ముఖ్యంగా యాదాద్రి భువనగిరి జిల్లాలో తయారయ్యే పోచంపల్లి హ్యాండ్లూమ్ ఉత్పత్తులను మాత్రమే ఈ ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించనున్నారు. చేనేత కార్మికుల నైపుణ్యాన్ని దేశవ్యాప్తంగా పరిచయం చేయడంతో పాటు వారికి ప్రత్యక్ష మార్కెట్ అవకాశాలు కల్పించడం ఈ ప్రదర్శన ప్రధాన ఉద్దేశ్యం.ఈ కార్యక్రమంలో భాగంగా బుధవారం జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి వ్యవసాయ సహకార మరియు చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ని మర్యాదపూర్వకంగా కలిసి, ఎగ్జిబిషన్‌కు ముఖ్య అతిథిగా హాజరు కావలసిందిగా ఆహ్వానించారు. అనంతరం వారి చేతుల మీదుగా "థ్రెడ్. పోచంపల్లి హ్యాండ్లూమ్ ఎగ్జిబిషన్" పోస్టర్‌ను ఆవిష్కరించారు.

# ధాన్యం కొనుగోలు ప్రక్రియ ను వేగవంతం చేయాలి

* **జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి**



భువనగిరి, ప్రజాస్ఫూర్తి : తుర్కపల్లి మండల కేంద్రంలోని పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రం ను అదేవిధంగా మండలంలోని దత్తాయిపల్లి గ్రామంలోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి బుధవారం సందర్శించి పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటి వరకు ఎంత ధాన్యం కొనుగోలు చేశారనీ, ఇంకా ఎంత ధాన్యం నిల్వలో ఉందని అధికారులను అడిగి తెలుసుకున్నారు. రైతులు తీసుకొచ్చిన ధాన్యాన్ని ఎటువంటి ఆలస్యం లేకుండా కొనుగోలు చేసి, తూకం వేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రోజుకు తూకం వేసిన ధాన్యానికి అనుగుణంగా సరిపడా లారీలు అందుబాటులో ఉన్నాయా లేదా అని అధికారులను ప్రశ్నించారు.ప్రతి రోజు కనీసం 4 లేదా 5 లారీల వరకు ధాన్యాన్ని కాంటా వేసి మిల్లులకు పంపించాలని అధికారులకు ఆదేశించారు. కొనుగోలు కేంద్రాలలో ధాన్యం నిల్వలు పేరుకుపోకుండా నిరంతరం రవాణా ప్రక్రియ కొనసాగించాలని సూచించారు.వర్షాల కారణంగా ఎక్కడైనా తడిసిన ధాన్యం ఉన్నా కూడా రైతులను ఇబ్బందులకు గురి చేయకుండా ప్రభుత్వ నిబంధనల ప్రకారం కొనుగోలు చేయాలని కలెక్టర్ తెలిపారు. రైతులు ధాన్యం విక్రయంలో ఎటువంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా అధికారులు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మన్నెగుడా ఆగ్రోస్ సెంటర్ లో జనుముల పంపిణీ

వికరాబాద్, ప్రజాస్ఫూర్తి : పూడూరు మండలం మన్నెగుడా ఆగ్రోస్ సెంటర్ లో జనుముల పంపిణీ కార్యక్రమం లో పరిగి శాసనసభ్యులు డాక్టర్ టి రామ్మోహన్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం వివిధ గ్రామాలకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రజా ప్రతినిధులు మాజీ ప్రజాప్రతినిధులు సర్పంచ్లు యువజన నాయకులు పాల్గొన్నారు



## మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం: ఎంపీడీవో సరోజ



గరిడేపల్లి, ప్రజాస్ఫూర్తి : సంఘాల బలోపేతం ద్వారా మహిళలను ఆర్థికంగా స్వావలంబన దిశగా తీసుకెళ్లడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అని ఎంపీడీవో ఆర్ సరోజ అన్నారు. మండల కేంద్రమైన గరిడేపల్లి లో ఎంపీడీవో కార్యాలయంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా బుధవారం 202627 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన యాక్షన్ ప్రణాళికలపై మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు వీర కుమారి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా డీపీఎం బెనర్జీ మాట్లాడుతూ వివిధ గ్రామ పంచాయతీల పరిధిలో సంఘాల వెలుపల ఉన్న మహిళలను గుర్తించి స్వయం సహాయక సంఘాల్లో చేర్పించే కార్యక్రమాన్ని చేపడుతున్నామని తెలిపారు. అలాగే 15 నుంచి 18 సంవత్సరాల మధ్య వయస్సు గల బాలికలతో ప్రత్యేక సంఘాలను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. వృద్ధులు, వికలాంగులను గుర్తించి వారిని కూడా సంఘాల్లో చేర్చి ఆర్థికంగా బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.ఈ ఆర్థిక సంవత్సరంలో బ్యాంక్ లింకేజీ, శ్రీనిధి రుణాలకు అర్హత కలిగిన సంఘాలను గుర్తించి రుణాలు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. మహిళలు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లిస్తూ ఆర్థిక క్రమశిక్షణ పాటించాలని సూచించారు. మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించి బ్యాంకులు, శ్రీనిధి ద్వారా రుణ సదుపాయాలు కల్పించి స్వయం ఉపాధి అవకాశాలు పెంచేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ సమావేశంలో ఏపీఎం అజయ్ నాయక్, సీసీలు సైదులు, సుజాత, మండల సమాఖ్య కోశాధికారి రజియా, కార్యదర్శి గంగమ్మ, ఐసీడీఎస్ సూపర్వైజర్లు రేవతి, ధరణి, మండల సమాఖ్య అకౌంటెంట్ దుర్గ, కంప్యూటర్ ఆపరేటర్ కవిత, 45 సంఘాల అధ్యక్షురాళ్లు, వివోఏలు పాల్గొన్నారు.

## ప్రజా సంస్కృతి ఉత్సవాలు జయప్రదం చేయండి

* ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి కట్ట నరసింహ



నల్లగొండ, ప్రజాస్ఫూర్తి : ప్రజానాట్యమండలి నల్లగొండ జిల్లా కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షుడు నాంపల్లి చంద్రమౌళి అధ్యక్షతన దొడ్డి కొమరయ్య భవనంలో జరిగింది ఈ సందర్భంగా ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి కట్ట నరసింహ మాట్లాడుతూ జూన్ 8 నుండి 20 వరకు ప్రజా సంస్కృత ఉత్సవాలు నిర్వహించాలని ఈ సందర్భంగా ఆయన తెలిపారుఅంతరించిపోతున్న జానపద గ్రామీణ కలలను కాపాడుకోవడం కళాకారులను ప్రోత్సహిస్తూ ప్రతి గ్రామాన ప్రజా సంస్కృతి ఉత్సవాలు నిర్వహించడం కళాకారుల కర్తవ్యం గా ముందుకెళ్లాలని అదేవిధంగా వృత్తి కళాకారులకు జీవన ఉపాధి కల్పించుట కొరకు కళాకారులకు ఎన్నికల ముందు ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు ప్రజా సంస్కృతిక ఉత్సవాలలో జానపద కళాకారులు పాల్గొని జయప్రదం చేయవలసిందిగా ఆయన కోరారు ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి పాలడుగు నాగార్జున ప్రజానాట్యమనలి జిల్లా అధ్యక్షులు కార్యదర్శి నాంపల్లి చంద్రమౌళి,కుమ్మరి శంకర్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాద సైదులు అమరగంటి ఐలయ్య పల్లె ప్రసాద్ చిలుకూరు బిక్షం చింతల విజయ మేడి అంజమ్మ జిల్లా కమిటీ సభ్యులు దండు శంకర్, పున్నం శ్రీను, పగిళ్ల యాదయ్య మాధవి దాసరి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## వార్డు మహిళలు అందరికి ఇందిరమ్మ చీరల పంపిణీ చేస్తాము

* 48 వ వార్డు కౌన్సిలర్ వెలుగు వెంకన్న



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: పట్టణంలోని 48 వ వార్డులో ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని వార్డు కౌన్సిలర్ వెలుగు వెంకన్న ప్రారంభించారు. 48 వ వార్డులోని చేనేత పారిశ్రామిక సహకార సంఘ భవనంలో జరిగిన చీరల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డు మహిళలు రేషన్ కార్డు జిరాక్స్ తీసుకుని రావాలని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళల సంక్షేమం కోసం అనేక పథకాలను ప్రవేశపెట్టిందని అన్నారు. కూరగాయల మార్కెట్లో పొదుపు సంఘాల ద్వారా చాలామంది మహిళలు లబ్ది పొందుతున్నారని, ప్రభుత్వం మహిళలకు వడ్డీలేని రుణాలు ఇస్తుందని, అందువల్ల మార్కెట్లో మహిళలకు చాలా ఉపయోగకరంగా వుందని ఆయన చెప్పారు. తెల్ల రేషన్ కార్డులు తీసుకుని వచ్చిన వార్డుకు చెందిన మహిళలు అందరికి ఇందిరమ్మ చీరల పంపిణీ చేయాలని ఆయన ఆర్ పి లకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ పి పద్మ, ఎస్ కె సలీం, వీర్ల వాసు తదితరులు పాల్గొన్నారు

# ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశం

* **ప్రజా దర్బార్ లో వచ్చిన ప్రతి దరఖాస్తుకు ప్రాధాన్యత ఇస్తూ వెంటనే పరిష్కరించాలి**
* **మంత్రి ధనసరి అనసూయ సీతక్క**



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ మంచినీటి సరఫరా,స్త్రీ శిశు సంక్షేమ,శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. బుధవారం జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్, ఎస్పీ డాక్టర్ శబరిష్, డీఎఫ్ఓ విశాల్ బత్తుల, ఆర్డీఓ క్రిష్ణవేణి, జడ్పీ సీఈవో పురుషోత్తం, జిల్లా స్థాయి ఉన్నతాధికారులందరితో కలిసి మహబూబాబాద్ జిల్లా ములుగు నియోజకవర్గ పరిధి కొత్తగూడ ఏజెన్సీ ఓటాయి, కొత్తగూడ మండల కేంద్రం లో రాష్ట్ర మంత్రి ధనసరి అనసూయ సీతక్క, ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ప్రజా దర్బార్లో వచ్చిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని, అధికారులకు మంత్రి సూచించారు,ఈ కార్యక్రమంలో పాల్గొన్న గ్రామపంచాయతీ సర్పంచులు,సూచించిన సమస్యల పరిష్కారం నిమిత్తం వెంటనే కార్యక్రమంలో పాల్గొన్న అధికారులకు ఆదేశాలు తగ్గు సూచనలు జారీ చేశారు, ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించి సంబంధిత విభాగానికి పంపి అర్హులైన ప్రతి ఒక్కరిని గుర్తించి వారు చేసుకున్న సంక్షేమ ఫలాల పథకాల ద్వారా లబ్ధి చేకూరే విధంగా చర్యలు తీసుకోవాలని మంత్రి తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా మహిళల ఆర్థిక అభివృద్ధి కోసం సుమారు 60 వేల 400 కోట్ల రూపాయల వడ్డీ లేని రుణాలను అందించడం జరుగుతుందని, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ లబ్ధిదారులు మహిళా సంఘాలలో సభ్యులుగా ఉంటే ఆర్థిక భరోసా కింద లక్ష రూపాయలు అందించడం జరుగుతుందన్నారు. రైతుల పొలాల వద్దకు వెళ్లడం కోసం రహదారుల నిర్మాణం లో ఫారెస్ట్ అధికారులు రైతులను ఇబ్బందులకు గురి చేయవద్దని, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా రోడ్లు నిర్మించాలని తెలిపారు,పేదవాడి సొంత ఇంటి నిర్మాణ కలను సహకారం చేయడానికి రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం చేపట్టడం జరుగుతుందని అందులో భాగంగానే జిల్లాకు వచ్చిన కోటాకు అదనంగా మరో రెండు వేల మంది లబ్ధిదారులను ఎంపిక చేయడం కోసం చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు,జిల్లాలోని ఇండ్లు నిర్మించుకోలేని పరిస్థితిలో ఉన్న వారి సౌకర్యార్థం ఒక సంస్థ ద్వారా ఇండ్లు నిర్మించుకునే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు,గ్రామీణ ప్రాంతాలలో కరెంటు సమస్యలను తీర్చడం కోసం ఉపముఖ్యమంత్రి చేత ప్రత్యేకంగా కరెంటు స్తంభాల మంజూరు నిధుల మంజూరు చేయించడం జరిగిందని ప్రతి ఒక్కరికి ఎలాంటి ఇబ్బంది లేకుండా నాణ్యమైన కరెంటును అందించాలని మంత్రి కోరారు,ఈ సందర్భంగా మంత్రి సీతక్క స్వయంగా ప్రజల సమస్యలను ఓపికగా వింటూ దరఖాస్తులను స్వీకరించారు. అర్జీదారులతో ముఖాముఖి మాట్లాడి సమస్యల తీవ్రతను అడిగి తెలుసుకున్నారు. ప్రజా దర్బార్లో ప్రధానంగా ఇండ్ల స్థలాలు, ఆసరా పెన్షన్లు, భూమి సమస్యలు, రేషన్ కార్డులు, గ్రామాల్లో రోడ్లు, తాగునీరు , ఆరోగ్య సహాయం వంటి పలు అంశాలపై ప్రజలు మంత్రికి వినతి పత్రాలు అందజేశారు. ప్రజల నుండి వచ్చిన కొన్ని దరఖాస్తులను మంత్రి సీతక్క అక్కడికక్కడే పరిశీలించి, సంబంధిత శాఖల అధికారులకు బదిలీ చేశారు. ప్రజా సమస్యల పట్ల నిర్లక్ష్యం వహించకుండా, చట్టపరిధిలో ప్రతి అర్జీని వీలైనంత త్వరగా పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజా ప్రభుత్వం.లబ్ధిదారులు కార్యాలయాల చుట్టూ తిరిగే పని లేకుండా, పాలనను ప్రజల వద్దకే తీసుకురావాలన్నదే మా సంకల్పం. ప్రతి ఒక్కరి దరఖాస్తును పరిశీలించి, అర్హులైన వారందరికీ ప్రభుత్వ పథకాలు, న్యాయం చేకూరేలా చూస్తాం" అని హామీ ఇచ్చారు.తమ సమస్యలను నేరుగా మంత్రికి చెప్పుకునే అవకాశం కల్పించడంపై, అలాగే మంత్రి సీతక్క చూపిన చొరవ, ఆప్యాయతపై ప్రజా దర్బార్కు వచ్చిన ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ స్నేహ శబరిష్ మాట్లాడుతూ రాష్ట్ర మంత్రి ప్రత్యేక చొరవతో నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని ప్రజలకు మరింత సేవ చేయాలనేమంచి ఉద్దేశంతోనిర్వహించడం జరిగిందన్నారు. ఈ ప్రజా దర్బారు ద్వారా వచ్చిన ప్రతి ఒక్క దరఖాస్తును పరిశీలించి అర్హులైన ప్రతి ఒక్కరికి పథకాలను అందించి వారికి న్యాయం చేయడం కోసం జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉందని తెలిపారు. ప్రతి అంశాన్ని అతి ప్రాధాన్యతగా తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ ప్రక్రియలో ప్రైవేటు సంస్థతో ఒప్పందం చేసుకొని లబ్ధిదారులకు ఇండ్లు నిర్మించి ఇచ్చుట కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ అన్నారు. గ్రామీణ ప్రాంతాలలో చెక్ డ్యాములు రోడ్లు కరెంటు లైట్లు, తదితర అంతర్గత అభివృద్ధి పనుల పై ప్రత్యేక చర్యలు తీసుకొని ముందుకు సాగుతామని మంత్రి తెలిపారు. కొత్తగూడ మండల పరిధిలో ట్రైబల్ వెల్ఫేర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి నా పిల్లలను మంత్రి సన్మానించారు. బుధవారం నిర్వహించిన ప్రజా దర్బార్ లో ఓటాయి గ్రామంలో (167), కొత్తగూడ రైతు వేదికలో (142) మొత్తం (309) దరఖాస్తులు వచ్చాయని, అట్టి దరఖాస్తుల పరిష్కారానికి జిల్లా కేంద్రంలో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసి అన్ని సంబంధిత విభాగానికి పంపి పరిష్కారం తీసుకోవాల్సిందిగా సంబంధిత అధికారులను ఆదేశించడం జరిగిందని జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ తెలిపారు,ఈ కార్యక్రమంలో ములుగు మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ రేగ కళ్యాణి, డి ఆర్ డి ఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన రాజు, డిసిఓ వెంకటేశ్వర్లు, అన్ని విభాగాల జిల్లా అధికారులు, తహసిల్దార్ రాజు, ఎంపీడీవో మునవర్ బేగ్, అన్ని గ్రామాల సర్పంచులు, ప్రజా ప్రతినిధులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## ఘనంగా హుస్నాబాద్‌లో బెల్లి లలితక్క 27వ వర్ధంతి వేడుకలు

హుస్నాబాద్, ప్రజాస్ఫూర్తి : హుస్నాబాద్ నియోజకవర్గ జేఏసీ ఆధ్వర్యంలో తెలంగాణ గాన కోకిల, మలి దశ తెలంగాణ ఉద్యమ అమరురాలు బెల్లి లలితక్క 27వ వర్ధంతి సందర్భంగా బుధవారం హుస్నాబాద్ పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో ఘనంగా నివాళులు అర్పించారు. హుస్నాబాద్ నియోజకవర్గ జేఏసీ కో కన్వీనర్ మేకల వీరన్న యాదవ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్ కవ్వ లక్ష్మారెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో బెల్లి లలితక్క పాత్ర చారిత్రాత్మకమని పేర్కొన్నారు. ఆమె అమరత్వంతో తెలంగాణ ఉద్యమం మరింత బలపడిందన్నారు. మేకల వీరన్న యాదవ్ మాట్లాడుతూ లలితక్క తెలంగాణ గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజల్లో చైతన్యం కల్పించారని, గుట్కా, సారా, వ్యభిచారం వ్యతిరేక ఉద్యమాలు నిర్వహించారని తెలిపారు. జేఏసీ కో కన్వీనర్ డ్యాగల సారయ్య మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో బెల్లి లలితక్క సేవలు చిరస్మరణీయమన్నారు.ఈ కార్యక్రమం లో హుస్నాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ దండి లక్ష్మి, కౌన్సిలర్ గాదెపాక రవీందర్, సిద్దిపేట జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షులు కేడం లింగ మూర్తి, మాజీ మున్సిపల్ చైర్మన్ సుద్దాల చంద్రయ్య, మాజీ ఎంపీపీ ఆకుల వెంకట్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఎడబోయిన తిరుపతిరెడ్డి, వంగ వెంకట్రాంరెడ్డి, గడిపే మల్లేష్,పందిల్ల శంకర్, బసిరెడ్డి సత్యనారాయణ రెడ్డి,బండి పుష్పరాజగోపాల్ రావు ,ఇల్లందుల లక్ష్మణ్ గౌడ్, మెతుకు కొమురయ్య, నాంపల్లి సమ్మయ్య, వొసకుల సుధాకర్, ఏనుగు మల్లారెడ్డి, అబ్బరబోయిన రవీందర్, ఎదులాపురం తిరుపతి, రాంచంద్రం, మల్లికార్జునరెడ్డి ,కన్నోజు రామకృష్ణ, శేషు, రవీందర్ గౌడ్,భాస్కర్ నాయక్, మండల జంపన్న, మండల సురేందర్, చెప్యాల ప్రకాశ్, వేముల జగదీశ్, తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి డోర్లి1 ఓసి ని సందర్శించిన అధికారులు



ప్రజా స్ఫూర్తి, కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా: బెల్లంపల్లి ఏరియా లో మూత పడిన డోర్లీ ఓసీ 1 గనిని ఎ కృష్ణ మోహన్ రావు (ఓఎస్ డి, కోల్ కంట్రోల్ ఆఫీస్ కొత్తగూడెం), సతీష్ గజ్ భియే (ఓఎస్ డి,కోల్ కంట్రోల్ ఆఫీస్ నాగ్ పూర్) లు బుధవారం సందర్శించారు. మూత పడ్డ గని ,పరిసర ప్రాంతాల్లో చేపట్టిన పర్యావరణ పనులు పరిశీలించారు. నాటిన మొక్కలను, ఎదిగిన వృక్షాలను చూశారు. పరిసర ప్రాంతాల్లో చేపడుతున్న నీటి నిర్వహణ, మృత్తిక సంరక్షణ చర్యలు వాటి వివరాలను తెలుసుకున్నారు. రక్షణ కంచేను చూశారు.అంతకుముందు జీఎం కార్యాలయంలో ఇంచార్జి జీఎం మచ్చగిరి నరేందర్ అధికారులకు బెల్లంపల్లి ఏరియా వివరాలను వెల్లడించారు.సన్మానించి మొక్కను అందజేశారు. ఈ కార్యక్రమంలో డోర్లి1 ప్రాజెక్ట్ అధికారి మరియు ఇంచార్జి ఎస్ఓటుజిఎం ఉమాకాంత్ ,కార్పోరేట్ అదనపు మేనేజర్లు సిహెచ్ శ్రీనివాస్, పి రవికిరణ్, వి తిరుపతి, గోనె బాబ్జి, డివైఎస్ఎస్ఓ రమేష్, ఏరియా సర్వే అధికారి అఫ్సర్ పాషా, డోర్లి ఓసి 1 మేనేజర్ మహేష్, ఎన్విరాన్మెంట్ అధికారి హరీష్ పాల్గొన్నారు.

## పొగాకు వినియోగం ఆరోగ్యానికి హానికరం



ప్రజాస్ఫూర్తి , జన్నారం : ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం మే 31ను పురస్కరించుకొని జన్నారం మండలం తపలాపూర్ గ్రామంలో బుధవారం రోజున పొగాకు వినియోగం ఆరోగ్యానికి హానికరం అని పొగాకు ఉత్పత్తులు గుట్కా, సిగరెట్ ,కైని, బీడీ, మొదలగు వాటిని ఏ రూపంలో వినియోగించిన నోటి క్యాన్సర్ ,ఊపిరితిత్తుల క్యాన్సర్, టిబి మొదలగు వ్యాధులకు గురి అవుతారని ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించి, ఏలాంటి పొగాకు ఉత్పత్తులను వినియోగించరాదని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ జంగమ్మ హెల్త్ అసిస్టెంట్ కమలాకర్, మాధవి గ్రామసర్పంచ్ కవిత రాజన్న, ఉప సర్పంచ్ మామిడి రాజన్న కార్యదర్శి రమేష్ ఆశా కార్యకర్తలు లలిత ,విజయ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## వార్డు ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

* 24 వ వార్డు కౌన్సిలర్ మన్నెం అరుణ మల్లేష్ యాదవ్




ప్రజాస్ఫూర్తి సూర్యాపేట: పట్టణంలోని 24 వ వార్డులో ఇందిరమ్మ చీరలు పంపిణీ కార్యక్రమాన్ని వార్డు కౌన్సిలర్ మన్నెం అరుణ మల్లేష్ యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వార్డులో తెల్ల రేషన్ కార్డు కలిగినటువంటి మహిళలకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. ప్రతి ఒక్క మహిళకు ఇందిరమ్మ చీర అందే విధంగా పంపిణీ చేస్తామని అన్నారు. తమ వార్డులో ఎక్కువగా నిరుపేద మహిళలు ఉన్నారని వారికి ప్రభుత్వ కార్యక్రమాలు వివరించి అరులైన వారిని దరఖాస్తు చేసుకునే విధంగా వారికి సమాచారం అందజేస్తునట్లు చెప్పారు. వార్డులో ఎక్కువగా పెన్షన్ దారులు దూర ప్రాంతానికి వెళ్లి పెన్షన్ తీసుకోవడం ఇబ్బంది పడుతున్నారని, అందువలన తమ ఇంటి పక్కన ఉన్న ఖాళి స్థలంలో చుట్టుపక్కల నాలుగు వార్డుల వారికి పెన్షన్లు లభించే విధంగా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో వార్డుకు చెందిన నాయకులు పిల్లల ఉపేందర్, బెంజారపు కరుణాకర్, ఎడ్లమల్ల సన్నీ, ఎండి ఖలీల్, పరసబోయిన నాగయ్య, అంజయ్య, శివ, పోతనబోయిన శ్రవణ్, అల్లి మురళి, డీజే నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఐకెపి వివోఏ ల సమ్మె



ప్రజాస్ఫూర్తి , జన్నారం : జన్నారం మండల కేంద్రంలోని తెలంగాణ గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ కార్యాలయం ముందు బుధవారం ఐకెపి వివోఏ లు సమ్మె చేపట్టారు.ఈ సందర్భంగా వివోఏ ల మండల అధ్యక్షురాలు దుంపల విజయ మాట్లాడుతూ వివోఏ లను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని, కనీస వేతనం రూపాయలు 26000 ఇవ్వాలని, జీవో 58 ను సవరించాలని, ఉద్యోగ భద్రత, ఆరోగ్య భద్రత ,హెచ్ఆర్ పాలసీ కల్పించాలని అంతే కాకుండా అర్హులైన వివోఏ లను సీ సీ లుగా పదోన్నతి కల్పిస్తూ సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు బాధావత్ రమేష్, ఉపాధ్యక్షులు లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి ముంజంపల్లి స్వప్న, కార్యదర్శి చకినాల నాగేష్, కోశాధికారి మెంగని పద్మ మరియు మండల ఐకెపి వివోఏలు పాల్గొన్నారు.

## బక్రీద్ పండుగ సందర్భంగా పటిష్ట భద్రతా ఏర్పాట్లు

* -అడిషనల్ ఎస్పీ రమేష్..



నల్లగొండ, ప్రజాస్ఫూర్తి : బక్రీద్ పండుగ సందర్భంగా జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా శాంతి భద్రతలను కట్టుదిట్టంగా అమలు చేయాలని జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ రమేష్ పోలీస్ అధికారులు, సిబ్బందికి ప్రత్యేక బ్రీఫింగ్ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండుగ వేళ ప్రజలు ప్రశాంతవాతావరణంలో వేడుకలు జరుపుకునేలా అన్ని మసీదులు, ఈద్‌గాహ్‌లు, ప్రధాన కూడళ్లు, రద్దీ ప్రాంతాలు, మార్కెట్ ప్రాంతాలలో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రార్థనల సమయంలో ట్రాఫిక్ అంతరాయం లేకుండా ప్రత్యేక ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.అంతేకాకుండా అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలపై నిరంతర నిఘా ఉంచాలని, సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షణ కొనసాగించాలని ఆదేశించారు. సోషల్ మీడియాలో మత విద్వేషాలు రెచ్చగొట్టే పోస్టులు, తప్పుడు ప్రచారాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఐటీ కోర్ విభాగాన్ని అప్రమత్తం చేశారు.ప్రజలు కూడా పోలీస్ శాఖకు సహకరించాలని, ఏదైనా అనుమానాస్పద సమాచారం తెలిసిన వెంటనే డయల్-100 లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని కోరారు.ఈ బ్రీఫింగ్‌లో 2 టౌన్ సిఐ రాఘవరావు, 1 టౌన్ రాజశేఖర్ రెడ్డి,ట్రాఫిక్ సిఐ మహా లక్ష్మయ్య, ఉమెన్ పోలీస్ స్టేషన్ సిఐ కరుణాకర్,ఎస్.ఐ లు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## రూరల్ పోలీస్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ నిర్వహించిన జిల్లా ఎస్పీ

మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డా.



శబరీష్ మహబూబాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిసరాలు, స్టేషన్ నిర్వహణ, రికార్డులు, సిబ్బంది విధుల నిర్వహణను పరిశీలించారు. స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ప్రజలకు మరింత స్నేహపూర్వక వాతావరణంలో సేవలు అందించాలని పోలీస్ సిబ్బందికి సూచించిన ఎస్పీ,దూర ప్రాంతాల నుండి పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రజలు ప్రస్తుత ఎండ తీవ్రత దృష్ట్యా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.పోలీస్ అధికారులతో సమావేశమైన ఎస్పీ మాట్లాడుతూ, యువతను గంజా వంటి మత్తు పదార్థాల బారిన పడకుండా కాపాడాల్సిన బాధ్యత ప్రతి పోలీసు అధికారిపై ఉందన్నారు. గ్రామ స్థాయిలో రాత్రి పహారా (నైట్ పట్రోలింగ్) విస్తృతంగా నిర్వహించాలని ఆదేశించారు. హోటల్స్, లాడ్జిలను ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తూ అనుమానాస్పద వ్యక్తులు, చట్ట విరుద్ధ కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని సూచించారు. గ్రామాల్లో సీసీటీవీ కెమెరాల ప్రాముఖ్యతపై ప్రజలకు అవగాహన కల్పించాలని, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండేలా సూచనలు ఇవ్వాలని తెలిపారు.గంజా వంటి మత్తు పదార్థాల వల్ల యువత భవిష్యత్తు నాశనం అవుతోందని, వాటి దుష్పరిణామాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులకు సూచించారు. గంజా సంబంధిత సమాచారం తెలిసిన ప్రజలు వెంటనే 8712656999 నంబర్‌కు సమాచారం అందించాలని ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డా. శబరీష్ ప్రజలను కోరారు.

## ద్విచక్ర వాహనాని ఢీకొట్టిన లారీ.. యువకుడు మృతి

జనగామ,ప్రజాస్ఫూర్తి : పట్టణ పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటన విషాదం నింపిం ది. బాధితురాలు పందు అనిత పోలీ సులుకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు,ఆమె కుమారుడు పందు చరణ్ కర్తీక్ (17) డెకరేషన్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం రాత్రి తన స్నేహి తుడు కుమార్ తో కలిసి స్కూటీ పై ఇంటికి తిరిగి వస్తుండగా బస్ స్టాండ్ చౌరస్తా సమీపంలో సూర్యాపేట వైపు నుండి అతి వేగంగా వచ్చిన సీజీ 08 ఎఎక్స్ 9545 నంబర్ గల లారీ, నిర్ల క్ష్యంగా వచ్చి వారి స్కూటీని ఢీకొట్టినట్లు తెలిపారు. ఈ ప్రమాదంలో చరణ్ కార్తీక్ కు తీవ్ర గాయాలు కాగా, వెంటనే చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్ కు తరలించే ప్రయత్నం చేసినప్పటికీ, వరంగల్ ఎంజీఎం కు తరలిచారు,ఆస్ప త్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. లారీ డ్రైవర్ నిర్లక్ష్యంగా వా హనం నడపడం వల్లే తన కుమారుడు మృతి చెందాడని, బాధ్యుల పై చట్టపర మైన చర్యలు తీసుకుని న్యాయం చే యాలని తల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

# అభివృద్ధికి శాఖల మధ్య సమన్వయం కీలకం: కలెక్టర్ అంకిత్



ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: జిల్లాలో అటవీ, రెవెన్యూ భూ సమస్యల పరిష్కారానికి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ సూచించారు. అభివృద్ధి పనులకు సంబంధించిన అటవీ అనుమతులు, భూ సేకరణ, డీఎల్సీ అనుమతులు వంటి అంశాలు ఎక్కువకాలం పెండింగ్‌లో ఉండకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లాలోని భద్రాచలం, పినపాక నియోజకవర్గాలలో నెలకొన్న అటవీ, రెవెన్యూ భూ సమస్యలు, అభివద్ధి పనులకు సంబంధించిన పెండింగ్ అటవీ అనుమతులపై జిల్లా కలెక్టర్ అంకిత్ అధ్యక్షతన భద్రాచలం ఐటీడీఏలో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకట రావు ,పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు , జిల్లా అటవీ శాఖ అధికారి కృష్ణ గౌడ్, ఐటిడిఏ పీఓ రాహుల్, సబ్ కలెక్టర్ మణాల్ శ్రేష్ఠ పాల్గొనగా, వివిధ శాఖల పరిధిలో పెండింగ్‌లో ఉన్న అభివద్ధి పనులకు అవసరమైన అటవీ అనుమతులు, భూ సేకరణ, డీఎల్సీ అనుమతులు, పోడు సమస్యలు, అభివద్ధి కార్యక్రమాలు తదితర అంశాలపై సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ గిరిజన ప్రాంతాలలో రహదారులు, విద్యుత్, త్రాగునీరు వంటి మౌలిక సదుపాయాల పనులు ఆలస్యం కాకుండా చూడాలని సూచించారు. మండల సమాఖ్య, అంగన్‌వాడీ భవనాలు, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు సంబంధించిన భూ సమస్యలను త్వరగా పరిష్కరించాలని తహసీల్దార్లను ఆదేశించారు. ఆర్‌వోఎఫ్ఆర్ పట్టాలు, డీఎల్సీ అనుమతులకు సంబంధించిన పెండింగ్ కేసులను ప్రత్యేకంగా పరిశీలించి అర్హులైన గిరిజనులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు మాట్లాడుతూ చర్ల, దుమ్ముగూడెం మండలాలలో రహదారులు, విద్యుత్, త్రాగునీరు తదితర అభివద్ధి పనులకు సంబంధించిన అనుమతులు ఎక్కువగా పెండింగ్‌లో ఉన్నాయన్నారు. గిరిజనులకు మౌలిక సదుపాయాలు కల్పించడం అధికారుల బాధ్యత అని అన్నారు. అర్హులైన గిరిజన రైతులకు పోడు పట్టాలు మంజూరు చేయడంతో పాటు వెదురు మొక్కలు అందించి వ్యవసాయం చేసుకునేలా ప్రోత్సహించాలని కోరారు. పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నియోజకవర్గంలో ఐటిడిఏ పరిధిలో సుమారు రూ.28.39 కోట్ల అభివద్ధి పనులు, పంచాయతీరాజ్ శాఖలో రూ.6.50 కోట్ల పనులు, ఆర్ అండ్ బి శాఖ పరిధిలో సుమారు రూ.67 కోట్ల అభివద్ధి పనులు అటవీ అనుమతుల కోసం పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. జిల్లా అటవీ శాఖ అధికారి కృష్ణ గౌడ్ మాట్లాడుతూ జిల్లాలో 58 శాతం అటవీ ప్రాంతం ఉన్నందున, ప్రతి అభివృద్ధి పనిలో అటవీ శాఖ అనుమతులు తప్పనిసరి అయినవి అని, సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో ఐటీడీఏ పీవో రాహుల్, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, డిఆర్ఓ పద్మావతి ఇంజనీరింగ్, ఆర్ అండ్ బి, ఇరిగేషన్, అటవీ, ఐటీడీఏ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## జన్నారంలో విస్తృతంగా పర్యటించిన ఎమ్మెల్యే



ప్రజాస్ఫూర్తి , జన్నారం : తడిసిన ప్రతి ధాన్యపు గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని నిర్మల్ జిల్లా డిసిసి అధ్యక్షుడు ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ రైతులకు హామీ ఇచ్చారు. జన్నారం మండలం కేంద్రంతో పాటు మండల పనులలోని పలు గ్రామాలలో మంగళవారం మధ్యాహ్నం భారీ ఈదురు గాలులు ఉరుములతో కూడిన వర్షానికి వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యాన్ని బుధవారం రోజున ఎమ్మెల్యే బొజ్జు పటేల్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొజ్జు పటేల్ మాట్లాడుతూ తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని, ప్రతిపక్షాలు చేస్తున్న దుష్ప్రచారాలను నమ్మవద్దని రైతులకు సూచించారు. రైతులు కోరిన విధంగానే గిట్టుబాటు ధరకే ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, అవసరమైన రవాణా సౌకర్యం కల్పిస్తామని, పై అధికారులతో మాట్లాడి ట్రాన్స్‌పోర్ట్ విషయంలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. గాలి బీభత్సానికి ఇంటి పైకప్పులు తొలగిపోయి నష్టపోయిన వారిని పరామర్శించి, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. నిత్యవసర వస్తువుల కొరకు ఆ కుటుంబాలకు ఆర్థిక సహాయం అందజేశారు. అనంతరం భారీ ఈదురు గాలులకు, వర్షాలకు ధ్వంసమైన పొనకల్ గ్రామ సమీపంలోని ఎస్.కే ఫంక్షణాలను పరిశీలించి యజమాని బశరత్ ను పరామర్శించారు. ప్రభుత్వం తరపున సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు. అనంతరం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ బక్కయ్య ఎంపీడీవో ఉమర్ షారీఫ్ మండల వ్యవసాయ అధికారి అంజిత్ కుమార్ మార్కెట్ కమిటీ చైర్మన్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## అర్హులకు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలు

* **జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**



ప్రజాస్ఫూర్తి, మెదక్ జిల్లా: జిల్లాలో అర్హులైన వారికి ఎస్సీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాలు అందించాలని జిల్లా కలెక్టర్ అధికారుల ఆదేశించారు. కలెక్టరేట్ క్యాంప్ ఆఫీస్ నుంచి గూగుల్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎస్సీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాలు అయినా టూవీలర్, త్రీ వీలర్, సోలార్ పంప్ సెట్, వివిధ పథకాలకు నిజమైన అర్హులను గుర్తించాలన్నారు. గతంలో జిల్లాలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా 1600 మంది దరఖాస్తు చేసుకున్నారని, మెదక్ జిల్లా లక్ష్యం 247 గా ఉందని ,వారిలో అత్యంత పారదర్శకంగా రుణాలు మంజూరు చేసేలా అధికారులు ప్రత్యేక ప్రణాళికను తయారు చేసుకోవాలన్నారు.మే 31వ తేదీ వరకు అన్ని దరఖాస్తుల స్కూటీని పూర్తి చేసి ఆన్లైన్ ద్వారా, ఆఫ్లైన్ ద్వారా లబ్ధిదారుల వివరాలను ఉన్నతాధికారులకు పంపించాలని ఆదేశించారు.

**తడిసిన ప్రతి గింజ కొంటాం**

తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేస్తామని రైతులకు కలెక్టర్ గురువారం భరోసా కల్పించారు. వాతావరణ ప్రతికూల ప్రభావంతో అకాల వర్షాలు పడుతున్నాయని రైతులు అధైర్య పడవద్దనీ, ప్రభుత్వ యంత్రాంగం అండగా ఉంటుందని, క్షేత్రస్థాయిలో తరిసిన ధాన్యాన్ని బాయిల్డ్ మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు కలెక్టర్ ఆదేశించారు. ఈ గూగుల్ మీట్ లో అదనపు కలెక్టర్ నగేష్, జడ్పీ సీఈఓ ఎల్లయ్య, ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి విజయలక్ష్మి, ఎంపీడీవోలు , వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ను వెంటనే అరెస్టు చేయాలి

* **కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అక్కు శ్రీనివాస్**




హుస్నాబాద్, ప్రజాస్ఫూర్తి : చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ రాజకీయ ఉన్మాదిలా మారి నోటికి ఇష్టం వచ్చినట్లు మాట్లాడడం సభ్య సమాజం తలదించుకునేలా ఉందని సమాజంలో ప్రజలను రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేస్తున్న బాల్క సుమన్ పై వెంటనే కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని కోరుతూ హుస్నాబాద్ పార్టీ కాంగ్రెస్ సీనియర్ నాయకులు అక్కు శ్రీనివాస్ ఆధ్వర్యంలో హుస్నాబాద్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు.ఈ సందర్భంగా అక్కు శ్రీనివాస్ విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేయండి అని రైల్వే పట్టాలను కోసేయండి సింగరేణిని ధ్వంసం చేయండి అనే వ్యాఖ్యలను ఖండిస్తూ అతనిపై వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. ఎంపీగా ఎమ్మెల్యేగా పనిచేసిన బాల్క సుమన్ స్పృహకోల్పోయి మాట్లాడుతున్నాడని ప్రజల ఆస్తులను ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేయండి అని అనడం ఎంతవరకు సమంజసమని అలా చేస్తే ప్రజలకే నష్టం ఏర్పడుతుందని బి ఆర్ ఎస్ నాయకులు కార్యకర్తలను రెచ్చగొట్టి రాజకీయ పబ్బం గడుపుకోవడం తప్ప బిఆర్ఎస్ పార్టీతోని ఏమి కాదని ఆయన అన్నారు. ప్రభుత్వానికి సహకరించాలని రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వామ్యం అయ్యే విధంగా తోడ్పాటును అందించాలనే ఉద్దేశం ఉండాలే తప్ప ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సరైనది కాదని ఆయన హెచ్చరించారు ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్లు పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మహిళా వారోత్సవాలు



ప్రజాస్ఫూర్తి, మెదక్ జిల్లా: 99 రోజుల ప్రజా పాలన ప్రణాళికలో భాగంగా గురువారం మెదక్ వెలుగు మండల సమైక్య కార్యాలయం నందు ప్రత్యేక మండల సమైక్య సమావేశంను ఏర్పాటు చేయడం జరిగింది. మీటింగుకు జిల్లా అభివృద్ధి అధికారి డిఆర్డిఓ శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ మెదక్ మండలంలో గత సంవత్సరము చేసిన ప్రగతి నివేదికను చూసి గ్రామ సంఘ అధ్యక్షులను అభినందించారు. మునుముందు కూడా ఇదే విధంగా అన్ని లక్ష్యాలను పూర్తి చేసుకుంటూ వెళ్లాలని సూచించారు. ప్రతి ఒక్క గ్రామ సంఘంలో వివో బిల్డింగులు పనులపై వివో గ్రామ సంఘం అధ్యక్షురాలను అడిగి తెలుసుకున్నారు. మండలంలోని ప్రస్తుతం రాయన్ పల్లి విలేజ్ లో బిల్డింగ్ మొత్తం పూర్తిచేసి ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉందని తెలియజేస్తున్నారు. మిగతా గ్రామాలలో స్లాపు గోడలతో పూర్తయినట్టు తెలిపారు. పనులన్నీ కూడా రెండు నెల లో పూర్తిచేసి ఉపయోగంలోకి తీసుకురావాలని తెలిపారు. గ్రామ సంఘం యొక్క నాయకత్వ బాధ్యతలను వివరించారు.బ్యాంకు నుంచి తీసుకున్న రుణాలు అన్ని 100% చెల్లించే విధంగా చూడాలని, ప్రతి గ్రామ సంఘంలో ఎన్ పి ఏ అనే పదం ఉండొద్దని ఒకవేళ వస్తే వారి దగ్గరికి వెళ్లి వారికి సానుకూలంగా నచ్చజెప్పి 100% రికవరీ అయ్యేవిధంగా చూడాలన్నారు. బకాయిలను ఎప్పటికప్పుడు రికవరీ చేయాలని దానిని గ్రామ సంఘంలో లేకుండా చేయాలని దృక్పథంతో ఉండాలని చెప్పారు. ప్రతి ఐదు సంఘాలకు ఒక బుక్ కీపర్ ను నియమించి వారిని కూడా వాడుకోవాలని ఎస్ఐజీల ద్వారా గౌరవ వేతనం చెల్లించేలా చూడాలని చెప్పిన్నారు. 202627 సంవత్సరానికి లక్ష్యాలు పెట్టుకొని 100% శాతం అమలు అయ్యేలాగా చూడాలని, ప్రతి ఒక్క సిబ్బంది సహకారం అందించాలని ఏదైనా సమస్య వచ్చినప్పుడు నా దృష్టికి తీసుకురావాలని తెలిపారు. గ్రామ సంఘాల అధ్యక్షురాలను గౌరవ డిఆర్డిఓ సన్మానం చేసి వారికి మెమొంటోస్ అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల సమైక్య పదాధికారులు,మండల సమైక్య అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ నాగరాజు, సీసీలు శ్రీనివాస్ రెడ్డి, మహాలక్ష్మి, శివరంజని, సత్యం,శ్రీనివాస్, అకౌంటెంట్ మాధవి, ఆపరేటరు అరవింద్ కుమార్, పాల్గొన్నారు.

## ఘనంగా జిట్టా సునీల్ యాదవ్ జన్మదిన వేడుకలు



ప్రజాస్ఫూర్తి, కూకట్ పల్లి : కైతలాపూర్ డివిజన్ పరిధిలో ని ప్రగతి నగర్ కమ్యూనిటీ హాల్ లో కూకట్ పల్లి నియోజకవర్గం సీనియర్ నాయకులు జిట్టా సునీల్ యాదవ్ జన్మదిన సందర్భంగా కైతలాపూర్ డివిజన్ లో పలు కాలనీ వాసులు మరియు రాజకీయ ప్రముఖులు స్నేహితులు మధ్య జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్ గారు, మాజీ కార్పొరేటర్లు పగడాల బాబురావు, కోడిచెర్ల మహేందర్ ,తూము శ్రావణ్ కుమార్, కాంగ్రెస్ నాయకులు , ఎ బ్లాక్ అధ్యక్షులు పి నాగిరెడ్డి, బి బ్లాక్ అధ్యక్షులు తూము వేణు,గుడెప్ నాగరాజ్, గాలిబాలాజీ, శేరి సతీష్ రెడ్డి,పుష్ప రెడ్డి,యాదగిరి, తూము మనోజ్ కుమార్,దినేష్,ప్రతాప్ రెడ్డి,రాచమల్ల శేఖర్ గౌడ్,రమేష్,కృష్ణ రాజ్ పుత్, ప్రవీణ్, అసిఫ్, సచిన్ తదితరులు పాల్గొన్నారు.

# మేడి ప్లస్ మెడికల్ షాపును ప్రారంభించిన ఎమ్మెల్యే కుంభం



వలిగొండ, ప్రజాస్ఫూర్తి : మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన మేడి ప్లస్ మెడికల్ షాపును భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి బుధవారం ప్రారంభించి అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మండల కేంద్రంతో పాటు మండల పరిసర ప్రాంత ప్రజలు దూర ప్రాంతాలకు వెళ్లి మెడిసిన్ తీసుకోవాలంటే ఇబ్బంది పడుతున్నారు అనే ఆలోచనతో వలిగొండలో అన్ని రకాల మందులు ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా మండల కేంద్రానికి చెందిన బత్తిని పద్మ సత్యనారాయణ నూతనంగా మేడి ప్లస్ మెడికల్ షాపును ప్రారంభించారు ప్రజలు మేడి ప్లస్ మెడికల్ షాపును సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే తెలిపారు షాప్ యజమాని సత్యనారాయణ మాట్లాడుతూ మా వద్ద అన్ని రకాల మందులు లభిస్తాయని అంతేకాకుండా వినియోగదారులకు సరసమైన ధరలకే మందులు విక్రయిస్తామని అంతేకాకుండా 30% డిస్కౌంట్ ఈ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కుంభం వెంకట్ పాపిరెడ్డి ప్రజాప్రతినిధులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ముస్లిం సోదరులకు బక్రీద్ పండుగ శుభాకాంక్షలు

**: జిల్లా ఎస్పీ రోహిత్ రాజు**



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: త్యాగానికి ప్రతీకగా జరుపుకునే బక్రీద్ పండుగను ముస్లిం సోదర సోదరీమణులు తమ కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో ఆనందోత్సాహాల మధ్య శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు శుభాకాంక్షలు తెలిపారు. ఈద్గా, మసీదులకు వెళ్లే మార్గాల్లో ట్రాఫిక్‌కు ఎటువంటి అంతరాయం కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నామని, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పోలీసు శాఖ తరపున భద్రతా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.అలాగే ఎవరైనా అనుమానాస్పదంగా కనిపించినట్లయితే వెంటనే పోలీసు శాఖకు సమాచారం అందించాలని, లేదా డయల్ 100ను సంప్రదించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# గాంధీభవన్‌లో కాంగ్రెస్ నేతల బాహాబాహీ.. కిందపడిన ఫిరోజ్‌ఖాన్

హైదరాబాద్ : కాంగ్రెస్ పార్టీ సమీక్ష సమావేశం రసాభాసగా మారింది. మంత్రులు పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్ ముందే నేతలు ఫిరోజ్ ఖాన్, ఉస్మాన్ అల్ హజ్రీ ఘర్షణపడ్డారు. ఉస్మాన్ నెట్టివేయడంతో ఫిరోజ్ ఖాన్ కిందపడ్డారు. ప్రోటోకాల్ విషయంలో వీరి మధ్య గొడవ జరిగింది. అజారుద్దీన్ పక్కన కూర్చునే అంశంలో వివాదం చెలరేగింది. ఈ క్రమంలో ఇరువురి మధ్య ఘర్షణ జరిగింది. ఇద్దరి మధ్య ఘర్షణను అడ్డుకునేందుకు సీనియర్ నేత వి. హనుమంతరావు ప్రయత్నించారు. ఆయనను కూడా నెట్టివేసేలా వారి తీరు ఉండటంతో మిగిలిన వారు అడ్డుకున్నారు. ఈ పరిణామంతో అజారుద్దీన్ అక్కడి నుంచి వెళ్లిపోయారు. సమావేశం ముగిసినట్లు పొన్నం ప్రభాకర్ ప్రకటించారు.

# కేంద్ర ప్రభుత్వం పంటలకు కనీస మద్దతు ధర ప్రకటించాలి

మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో పెరుమామిళ్ల జగన్నాథం భవనంలో సంయుక్త కిసాన్ మోర్చా ఎస్ కే యం మహబూబాబాద్ జిల్లా కన్వీనింగ్ కమిటీ కామ్రేడ్ నల్లపు సుధాకర్ అధ్యక్షతన జరిగినది.ఈ సమావేశంలో ఎస్ కే యం జిల్లా కన్వీనర్ కామ్రేడ్ గుజ్జు దేవేందర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 202627 సంవత్సరానికి పంటలకు నామమాత్రపు ధరలు పెంచి చేతులు దులుపుకున్నదని కేంద్రం పెంచిన ధరలు రైతాంగాన్ని మోసం చేస్తూ ఈ ధరలను డాక్టర్ స్వామినాథన్ సిఫారసుల మేరకు లేవని కేంద్ర ప్రభుత్వం పాత పద్ధతిలో తూతూ మంత్రంగా పెంచి రైతన్న మోసం చేస్తూ చేతులు దులుపుకున్నదని వారు ప్రభుత్వాన్ని ఎద్దేవ చేశారు. అధికారాలు రాకముందు బిజెపి అధికారంలోకి వస్తే డాక్టర్




స్వామినాథన్ సిఫారసులు అమలు చేస్తావని రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని వాగ్దానం చేశారని ఢిల్లీ కేంద్రంగా 13 నెలలకు పైగా భారత రైతాంగం చేసిన పోరాటానికి తలవగ్గిన కేంద్ర ప్రభుత్వం ఆ సందర్భంగా రాతపూర్వకంగా ఇచ్చిన హామీలలో ఏ ఒక్కటి నేటికీ అమలు చేయలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు.అమెరికా యూరోప్ యూనియన్లతో చేసుకున్న అసమాన చీకటి ఒప్పందాలని వెంటనే రద్దు చేయాలని భారత వ్యవసాయ రంగాన్ని కాపాడుకోవాలని రైతులు కూలీల ఆత్మహత్యలు నివారించాలని రైతులకు వాస్తవ సాగు ఖర్చుల ఆధారంగా లెక్కించి డాక్టర్ స్వామినాథన్ సిఫారసులను తక్షణమే అమలు చేయాలని లేనియెడల రైతాంగాన్ని పెద్ద ఎత్తున సమీకరించి ఉద్యమిస్తామని వారు కీర్తన ప్రభుత్వాన్ని హెచ్చరించారు.కేంద్ర ప్రభుత్వం 202627 గాను తీసుకువచ్చిన మద్దతు ధరల పత్రాలను మే 27 నుంచి 29 వరకు గ్రామ గ్రామాలలో దగ్ధం చేయాలని 30 వ తారీఖున మహబూబాబాద్ జిల్లాలోని 18 మండలాల్లో తహసిల్దార్ కార్యాలయం ముందు బిల్లు పత్రాలను దగ్ధం చేస్తూ తహసిల్దార్లకు వినతి పత్రాలు అందజేయాలని చివరిగా మే 31వ తేదీన మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి వినతిపత్రం అందజేయాలని ఈ సమావేశం నుండి జిల్లా రైతాంగానికి రైతు సంఘాలకు వ్యవసాయ కార్మిక సంఘాలకు పిలుపునిస్తున్నాం ఈ అన్ని కార్యక్రమాలలో రైతులు కూలీలు రైతు కూలి సంఘాలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా ఎస్ కే యం మహబూబాబాద్ జిల్లా కన్వీనింగ్ కమిటీ తరపున కోరుతున్నాం.ఈ కార్యక్రమంలో ఏఐకేఎస్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శెట్టి వెంకన్న, గోనిగంటి రాజన్న, ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి ఆలకుంట్ల సాయిలు, ఏఐకేఎంఎస్ జిల్లా నాయకులు దంతూజు ఉపేంద్ర చారి, నల్లపు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ కుటుంబాలను
# కంటికి రెప్పలా కాపాడుకుంటుంది

*** కడకంచి బాలమణి**



జనగామ,ప్రజాస్ఫూర్తి : జిల్లా లోని కాంగ్రెస్ నాయకులు మంగళవారం జిల్లా కేంద్రం సమీపాన ప్రమాదంలో మరణించిన బసిరెడ్డిపల్లి సర్పంచ్ కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. బుధవారం బచ్చన్నపేట మండలం, బండరెడ్డిపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు(సర్పంచ్) కుమారుడు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా, ఆ కుటుంబాన్ని కాంగ్రెస్ నాయకులు పరామర్శించారు.ఈ సందర్భంగా నాయకులతో కలిసి కొడుకు కోల్పోయిన సర్పంచ్ కన్నీరు తుడిచిన జనగామ మున్సిపల్ ఛైర్పర్సన్ కడకంచి బాలమణి. అనంతరం కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, పార్టీ తరపున అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కుటుంబ అవసరాల నిమిత్తం రూ.10,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల కుటుంబాలకు ఎల్లప్పుడూ తోడుగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా, మండల,గ్రామ కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, మహిళా నాయకురాలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడ మే ప్రభుత్వ ధ్యేయం

*** మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్ రెడ్డి.**



జనగామ, ప్రజాస్ఫూర్తి : ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉండే విదం గా చుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని పలు వార్డులను ఆయన పరిశీలించి పారిశుధ్య పరిస్థితులను సమీక్షించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ చెత్తను రోడ్లపై, ఖాళీ స్థలాల్లో వేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు సూచించారు. ఇండ్ల మధ్యలో ఉన్న ఖాళీ ప్లాట్లలో పెరిగిన చెట్లు, పొదలను యజమానులు తొలగించాలన్నారు. కొత్తగా ఇళ్లు నిర్మిస్తున్న వారు రోడ్ల పై ఇసుక, కంకర వంటి నిర్మాణ సామగ్రిని వేసి ప్రజలకు ఇబ్బందులు కలిగించ వద్దని హెచ్చరించారు. పట్టణ పరిశుభ్రతకు ప్రజల సహకారం ఎంతో అవసర మని, అందరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కమిషనర్ కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు

# బక్రీద్‌కు కట్టుదిట్టమైన బందోబస్తు

*** ఈద్గా వద్ద ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఆకస్మిక తనిఖీ.**



నల్లగొండ, ప్రజాస్ఫూర్తి : మునుగోడు రోడ్డులోని ఈద్గా ప్రాంగణాన్ని స్వయంగా ఎస్పి శరత్ చంద్ర పవర్ బుధవారం పరిశీలించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారీగా తరలిరానున్న ముస్లిం సోదరుల కోసం ప్రత్యేక పార్కింగ్, ట్రాఫిక్ డైవర్షన్స్, తాగునీటి ఏర్పాట్లు చేశామని తెలిపారు. అవాంఛనీయ ఘటనలకు చెక్ పెట్టేందుకు ప్రత్యేక పోలీస్ నిఘా పెట్టామని, సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు, రెచ్చగొట్టే పోస్టులు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.ప్రజలు పోలీస్ శాఖకు సహకరించి సామరస్య వాతావరణంలో బక్రీద్ జరుపుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ డీఎస్పీ శివరాం రెడ్డి, ఎస్బీ సీఐ ఆది రెడ్డి, 1 టౌన్ సీఐ రాజశేఖర్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ హాఫీజ్ ఖాన్, డిప్యూటీ మేయర్ ఆమేర్, కార్పొరేటర్లు, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

# అమ్మ సేవలో ఎమ్మెల్యే దంపతులు



ప్రజాస్ఫూర్తి, మెదక్ జిల్లా: మెదక్ జిల్లా ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ ఏడుపాయల వన దుర్గా భవాని దేవస్థానాన్ని గురువారం మైనంపల్లి రోహిత్ తమ సతీమణితో కలిసి దర్శించుకున్నారు. ఆలయంలో అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేద పండితులు ఆశీర్వచనం అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏడుపాయల అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని, జిల్లా అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని కోరుకుంటున్నా అన్నారు. దేవస్థాన అభివృద్ధికి, భక్తుల సౌకర్యాలకు ప్రభుత్వం తరపున పూర్తి సహకారం అందిస్తా అని తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, మండల అధ్యక్షులు మున్సిపల్ చైర్మన్ లు, వైస్ చైర్మన్లు, కౌన్సిలర్స్ దేవస్థాన కార్యనిర్వహణాధికారి, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

## అరణ్య ఫామ్‌హౌస్‌కు బండి భగీరథ్‌ను
# తీసుకువెళ్లి సీన్ రీకన్‌స్ట్రక్షన్



హైదరాబాద్ : పోక్సో కేసులో నిందితుడు బండి భగీరథ్‌ను పేట్‌బషీరాబాద్ పోలీసులు కస్టడీకి తీసుకుని మొయినాబాద్ మండలంలోని అరణ్య ఫామ్‌హౌస్‌కు తీసుకువెళ్లి సీన్ రీకన్‌స్ట్రక్షన్ చేశారు. ఇప్పటికే పోలీసులు బండి భగీరథ్ నలుగురు స్నేహితులను ప్రశ్నించారు. బాధితురాలు, ఆమె తల్లి స్టేట్‌మెంట్ ఆధారంగా దర్యాప్తు చేస్తున్నారు. అరణ్య ఫామ్‌హౌస్‌లో తన కుమార్తెపై అఘాయిత్యం జరిగిందని బాధితురాలి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన కుమార్తెను ఒత్తిడి చేసి మద్యం తాగించి, అనంతరం అనుచితంగా ప్రవర్తించినట్టు ఆమె తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో పోలీసులు బండి భగీరథ్‌ను కస్టడీకి తీసుకువెళ్లి, సీన్ రీకన్‌స్ట్రక్షన్ చేశారు. ఈ నెల 16వ తేదీన అరెస్టైన బండి భగీరథ్ ప్రస్తుతం చర్లపల్లి జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్నాడు. మల్కాజ్‌గిరి కోర్టు మూడు రోజుల కస్టడీకి అనుమతించిన నేపథ్యంలో పోలీసులు ఈరోజు ఉదయం చర్లపల్లి కేంద్ర కారాగారానికి చేరుకుని, అతడిని కస్టడీకి తీసుకున్నారు.

# హైదరాబాద్, కరీంనగర్‌లో ఈడీ సోదాలు




హైదరాబాద్: తెలంగాణలో పలు చోట్ల ఈడీ సోదాలు చేపట్టింది. హైదరాబాద్, కరీంనగర్‌లో ఇసుక, గ్రానైట్ వ్యాపారుల ఇళ్లు, కార్యాలయాల్లో ఈ తనిఖీలు కొనసాగుతున్నాయి. నాలుగు కంపెనీలకు సంబంధించి 8 చోట్ల ఈ సోదాలు జరుగుతున్నాయి. కీలక పత్రాలను అధికారులు పరిశీలిస్తున్నారు.

# ఆర్టీఏ కార్యాలయాల్లో ఏసీబీ తనిఖీలు.. డ్రైవింగ్ లైసెన్స్‌లు స్వాధీనం




హైదరాబాద్: నగరంలోని ఆర్టీఏ కార్యాలయాల్లో ఏసీబీ అధికారులు తనిఖీలు చేపట్టారు. నాగోల్, కొండాపూర్, మేడ్చల్ కార్యాలయాల్లో అవకతవకలు జరుగుతున్నట్లు గుర్తించారు. ఆన్‌లైన్ ఫీజుకు అదనంగా డబ్బులు వసూలు చేస్తున్నట్లు గుర్తించారు. కొండాపూర్ ఆర్టీఏ కార్యాలయం వద్ద 150 ప్రింటెడ్ ఆర్సీలు, డీఎల్‌లు.. నాగోల్ కార్యాలయంలో ఏజెంట్ల వద్ద రూ.2.41 లక్షలు, డ్రైవింగ్ స్కూల్ యజమాని సుధాకర్‌రెడ్డి వద్ద 184 డ్రైవింగ్ లైసెన్స్‌లను స్వాధీనం చేసుకున్నారు. ధ్రువపత్రాల మంజూరులో దళారుల పాత్రను ఏసీబీ గుర్తించింది. ఈ అవకతవకలపై ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనుంది.

## 'మృతదేహాన్ని ఎవరెస్ట్‌పైనే వదిలేస్తాం'..
# హైదరాబాదీ పర్వతారోహకుడి కుటుంబం



హైదరాబాద్ : గతవారం పర్వతారోహణ ముగించుకొని దిగువకు వస్తుండగా ఎవరెస్ట్‌పై హైదరాబాద్‌కు చెందిన పర్వతారోహకుడు అరుణ్ కుమార్ తివారీ మృతిచెందిన విషయం తెలిసిందే. అయితే మృతదేహాన్ని పర్వతంపైనే వదిలి వేయాలని నిర్ణయించుకున్నట్లు అతడి కుటుంబసభ్యులు వెల్లడించారు. మృతుడి బావమరిది సుధీర్ ఉపాధ్యాయ మాట్లాడుతూ.. శివుని నివాసమైన పర్వతాలలో అరుణ్ కుమార్ ప్రాణాలు వదిలారు కాబట్టి అక్కడే వదిలేయాలని నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. మృతదేహాన్ని నగరానికి తీసుకువచ్చేందుకు చేపట్టే ప్రక్రియలు ముగిసే సరికే మృతదేహం చాలా దెబ్బతింటుందని.. మంచులో నుంచి దానిని తీసే ప్రక్రియ కూడా చాలా ఖర్చుతో కూడుకున్నదని అన్నారు. అందువల్ల ఈ కఠిన నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని పేర్కొన్నారు. ఎవరెస్ట్ యాత్రను నిర్వహించిన నేపాల్‌కు చెందిన పయనీర్ అడ్వెంచర్స్ డైరెక్టర్ నివేశ్ కర్కి మాట్లాడుతూ 2025లో కూడా ఎవరెస్ట్ అధిరోహించడానికి తివారీ ప్రయత్నించగా.. ఆరోగ్య సమస్యలు తలెత్తడంతో 7200 మీటర్ల ఎత్తు నుంచి వెనుదిరిగినట్లు పేర్కొన్నారు. గత వారం ఎవరెస్ట్‌ను విజయవంతంగా అధిరోహించి కిందకు దిగుతుండగా అస్వస్థతకు గురై శిఖరానికి కొంచెం దిగువన ఉన్న హిల్లరీ స్టెప్ (డెత్ జోన్) సమీపంలో కన్నుమూసినట్టు పేర్కొన్నారు. అది చాలా ఎత్తులో ఉన్నందున అక్కడి నుంచి మృతదేహాన్ని కిందకు తీసుకురావడం చాలా ప్రమాదకరమైన.. ఖరీదైన ప్రక్రియ అని పేర్కొన్నారు.



# స్కర్టు... షర్టు జోడి అదిరె!

ఈ తరం అమ్మాయిల్ని ఓ పట్టాన వర్ణించలేమండీ బాబు. ఒక్కోసారి ఆధునికతకు నిదర్శనంలా ఉంటారు. అంతలోనే సంప్రదాయంతో ఆశ్చర్యపరుస్తారు. మొత్తంగా ఫ్యూజన్ తరం అనొచ్చేమో! కాబట్టే కదా... ఇలా ఫ్యూజన్ స్టైల్స్‌ని ఎక్కువగా మెచ్చేస్తున్నారు. పొడవాటి స్కర్ట్... దానిపైన కాలర్‌తో షర్ట్. నిజానికి ఇది కొన్నేళ్లక్రితం సందడి చేసిన ఫ్యాషనే! ఇప్పుడు మళ్లీ జెన్ జీల కారణంగా తెరమీదకి వచ్చింది. ఈమధ్య ఈ స్టైల్‌ని ఏఐలో చేసుకుని తెగ మురిసిపోయారు. ఫొటోల్లో ఇంత అందంగా అనిపించినప్పుడు ఇక బయట ప్రయత్నించకుండా ఉంటారా? కాబట్టే, వీటి సందడి మళ్లీ మొదలైంది. అమ్మాయిల ఆల్ టైమ్ ఫేవరెట్ జాబితా తీయండి. స్కర్ట్ తప్పక ఉంటుంది. సౌకర్యానికి సౌకర్యం... అందానికి అందం. కాబట్టే, కాలంతో సంబంధం లేకుండా దీన్ని ధరించేస్తుంటారు. లెహెంగాలు, మోడరన్ ఓణీలకు ఉన్న ఆదరణ గురించీ ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. వేడుకలంటే వీటి సందడి ఉండాల్సిందే. చూడటానికీ వేసుకోవడానికీ బాగుంటాయి కానీ... ఎన్నిసార్లని వేస్తాం? ఎంత ఖర్చుపెట్టి కొన్నా బీరువాలో అలా ఉండాల్సిందే! అలాంటివాటికీ న్యాయం చేయాలనుకున్నారేమో... ఈ స్టైల్‌కి ఓటేస్తున్నారు. కాటన్, బనారస్, నెట్, ఎంబ్రాయిడరీ... అన్న తేడా లేదు. ప్రతిదానిమీదకీ శాటిన్, కాటన్ షర్టులని జత చేస్తున్నారు. షర్టు అఫీషియల్ లుక్‌ని ఇస్తుంది. పైగా పొడవాటి స్కర్టు కూడా హుందాతనాన్ని పెంచేదే. ఇంకేం ఆఫీసు, కాలేజీలకు చక్కా వేసుకోవచ్చు. అటునుంచే పార్టీకి వెళ్లాల్సినా కంగారే లేదు. వీ నెక్‌లా తోచేలా పై గుండీ తీస్తే చాలు. పెద్ద వేడుకైతే చేతులు మడిచి, లేయర్ల హారాన్ని వేస్తే సరి. ఈ వేడికైతే టైట్ ఫిట్టింగ్ దుస్తుల కంటే ఇవి మరింత హాయి. ఎన్నెన్ని ప్రయోజనాలో కదా! కాబట్టే, మనసు పారేసుకుంటున్నారు. ఆధునికతను అందిపుచ్చుకుంటూనే సంప్రదాయ అందం! స్టైల్ అదిరిపోలేదూ? ఇంకేం మీరూ బీరువాలోంచి లెహెంగాలు, స్కర్టులు తీసి... షర్టు జత చేయండి. స్టైల్‌లో భాగమైపోండి.





# రాగుల్లో దాగున్న 'ఆరోగ్యం'!

**మారుతున్న జీవనశైలి, ఆహారపుటలవాట్ల కారణంగా చాలామంది చిన్న వయసులోనే పలు ఆరోగ్య సమస్యలకు గురవుతున్నారు. వీటిని దూరం చేసుకోవాలంటే సరైన ఆహార నియమాలు పాటించాలని చెబుతున్నారు నిపుణులు. ముఖ్యంగా రాగుల్ని రోజువారీ ఆహారంలో భాగం చేసుకోవాలని సూచిస్తున్నారు. ఈ నేపథ్యంలో రాగుల వల్ల ఆరోగ్యానికి చేకూరే ప్రయోజనాలేంటో తెలుసుకుందాం రండి..**

**ఎముకల దృఢత్వానికి..**

రాగుల్లో క్యాల్షియం అధికంగా ఉంటుంది. ఇది ఎముకల దృఢత్వానికి తోడ్పడుతుంది. అలాగే దంతాలు గట్టిగా ఉండేలా చేస్తుంది. అందుకే ఎదిగే పిల్లలకు రాగులను క్రమం తప్పకుండా ఇవ్వాలంటున్నారు నిపుణులు. అలాగే వయసు మళ్లిన వారు కూడా రాగులను తీసుకోవడం ద్వారా ఆస్టియోపొరోసిస్ వంటి సమస్యల బారిన పడకుండా జాగ్రత్తపడచ్చంటున్నారు.

**బరువు అదుపులో..!**

అధిక బరువుతో బాధపడే వారు రాగులను ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల బరువును అదుపులో ఉంచుకోవచ్చంటున్నారు నిపుణులు. రాగుల్లో ఫైబర్ ఎక్కువగా, కొవ్వు తక్కువగా ఉంటుంది. దానివల్ల రాగులు కొద్ది మొత్తంలో తీసుకున్నా కడుపు నిండిన భావన కలుగుతుంది. ఫలితంగా ఎక్కువసార్లు ఆహారం తీసుకోవాలన్న కోరిక దరిచేరదు. అదే సమయంలో శరీరానికి కావాల్సిన పోషకాలు కూడా అందుతాయి.

**గ్లూకోజ్ అదుపులో..**

బియ్యం, గోధుమలతో పోలిస్తే రాగుల్లో 'గ్లైసెమిక్ ఇండెక్స్' తక్కువగా ఉంటుందట. ఫలితంగా రకంలోని గ్లూకోజ్ స్థాయిలు అదుపులో ఉంటాయని చెబుతున్నారు నిపుణులు.





**గర్భిణులు, పాలిచ్చే తల్లులకు..**

రాగుల్లో క్యాల్షియంతో పాటు ఫోలిక్ యాసిడ్ కూడా ఉంటుంది. ఇది గర్భిణులకు ఎంతగానో ఉపయోగపడుతుంది. రాగుల్లో ఉండే ఖనిజాలు రోగనిరోధక శక్తిని పెంచుతాయి. అలాగే ఇందులో ఉండే క్యాల్షియం, ఐరన్, అమైనో ఆమ్లాలు పాలిచ్చే తల్లుల్లో పాల ఉత్పత్తి పెరగడానికి దోహదం చేస్తాయని నిపుణులు చెబుతున్నారు.

**అందానికీ..!**

రాగులు కేవలం ఆరోగ్యానికే కాదు.. అందాన్నీ ద్విగుణీకృతం చేస్తాయంటున్నారు నిపుణులు. రాగుల్లో యాంటీ ఆక్సిడెంట్లు, ఫినోలిక్ ఆమ్లాలు అధికంగా ఉంటాయి. ఇవి వృద్ధాప్య ఛాయలు దరిచేరకుండా కాపాడతాయట. అలాగే వీటిలో ఉండే అమైనో ఆమ్లాలు చర్మంలో కొలాజెన్ ఉత్పత్తిని పెంచి.. చర్మ ఆరోగ్యానికి సహాయం చేస్తాయని చెబుతున్నారు నిపుణులు.



వాటిని ఫ్రిజ్‌లో

# పెడుతుంటే..!

**ఫ్రిజ్‌లో పెడితే చాలు.. ఎన్ని రోజులైనా పదార్థాలు పాడైపోవు అనుకుంటారు కొంతమంది. కానీ వాటికీ ఎక్స్‌పైరీ డేట్ ఉంటుంది. అవి చూడ్డానికి బాగానే ఉన్నా.. ఆరోగ్యాన్ని పాడు చేసే బ్యాక్టీరియా వాటిలో అభివృద్ధి చెందుతుంది అంటున్నారు నిపుణులు. ఈ క్రమంలో కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు.**

* ఏ కాలంలోనైనా ఫ్రిజ్‌లో ఉష్ణోగ్రత 4.4 డిగ్రీల సెల్సియస్‌కు మించకుండా చూసుకోవాలి.
* పాలు, పాల పదార్థాలు.. వంటి త్వరగా పాడైపోయే పదార్థాలు బయటి నుంచి తెచ్చిన రెండు గంటల్లోపే ఫ్రిజ్‌లో పెట్టేయాలి. ఒకవేళ బయట ఉష్ణోగ్రత 32.2 డిగ్రీల సెల్సియస్ కంటే ఎక్కువగా ఉన్నట్లయితే తెచ్చిన గంటలోపే ఫ్రిజ్‌లో పెట్టాలి.
* గడ్డకట్టిన పదార్థాలను కిచెన్ ప్లాట్‌ఫామ్, టేబుల్‌పై పెట్టి వాటంతటవే కరిగిపోతాయి అని వదిలేయడం మంచిది కాదు. ఎందుకంటే గది ఉష్ణోగ్రత వద్దకు చేరేసరికి ఆయా పదార్థాల్లోని బ్యాక్టీరియా రెండింతలవుతుంది. కాబట్టి కౌంటర్ టాప్స్‌పై పెట్టి ఘనీభవించిన పదార్థాల్ని అస్సలు కరిగించకూడదు. నీటిలో/మైక్రోవేవ్ ఓవెన్‌లో పెట్టి కరిగించడం సురక్షితం.
* సాధ్యమైనంతవరకు మనం తీసుకునే ఆహార పదార్థాల్ని తాజాగా, పరిశుభ్రంగా, అప్పటికప్పుడు వండుకొని, వేడివేడిగా తీసుకోవడమే మంచిదని చెబుతున్నారు నిపుణులు. కాబట్టి వీలైనంతవరకు మిగిలిపోయిన అన్ని పదార్థాలనీ ఫ్రిజ్‌లో తోసేయకుండా జాగ్రత్త పడడం మంచిది.

# పూసింది పూసింది... టీ పువ్వు!

**మనం రోజూ ఎంతో ఇష్టంగా తాగే టీ మొక్కని కుండీలో పెంచుకుంటే ఎంత బాగుంటుందో కదూ. పైగా వీటిని అందంకోసం కూడా పెంచుతుంటారని తెలుసా...**

టీ కోసం ప్రపంచవ్యాప్తంగా ఎక్కువగా సాగు చేసే రకం కామెల్లియా సినెన్సిస్. దీంతోపాటు అస్సామికా, రోసియా రకాల్నీ సాగు చేస్తారు. వీటిని తోటల్లో ఆకుల కోసమే సాగు చేస్తారు. కానీ నాలుగేళ్ల వయసు వచ్చేసరికి ఇవి శరదృతువులో అందంగా పుష్పిస్తాయి. ఫలాల్నీ ఇస్తాయి. తెలుపు లేదా గులాబీరంగులో ఉండే ఈ తేయాకు పువ్వులు సువాసన వెదజల్లుతుంటాయి.

**ఎలా పెంచాలి?**

సాధారణంగా చల్లని కొండ ప్రాంతాల్లోనే... అంటే, 13 నుంచి 30 డిగ్రీల సెల్సియస్‌లో ఎక్కువగా పెరుగుతాయి. అయితే ఉష్ణోగ్రత ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో కుండీల్లో పెంచుకునేటప్పుడు ప్రత్యక్ష, లేదా పాక్షిక కాంతి 4 నుంచి 6 గంటలపాటు మాత్రమే పడేలా చూసుకోవాలి. మధ్యాహ్నంవేళ నీడ అవసరం. ఆమ్లపూరిత నేల అయితే మంచిది. వేర్ల దగ్గర నీరు నిలవకుండా చూడాలి. రెండుమూడు వారాలకోసారి పిచికారీ చేస్తూ నెలకోసారి సేంద్రియ ఎరువు వేస్తే కుండీలోనూ మొక్కలు చక్కగా పెరుగుతాయి. రెండు అడుగులు పెరిగాక కొమ్మల్ని కత్తిరించుకుంటుంటే గుబురుగా పెరుగుతుంది. వేసవి ప్రారంభంలో... విచ్చుకోని లేత ఆకుల్ని కోసి ఎండబెట్టడం, నీడన వడలేలా చేయడం, చుట్టినట్లుగా చేయడం ద్వారా బ్లాక్, వైట్, గ్రీన్ టీలను తయారుచేసుకోవచ్చు. నారు మొక్కలు లేదా బాగా పెరిగిన మొక్కల నుంచి ముదురు కొమ్మను కత్తిరించి నాటినా పెరుగుతాయి.





# భాష ఏదైనా... మమేకమవుతా : శ్రీలీల

టాలీవుడ్ యంగ్ సెన్సేషన్ శ్రీలీల ఇండస్ట్రీలోకి వచ్చిన అతి తక్కువ సమయంలోనే తన అద్భుతమైన డాన్స్, చలాకీతనంతో యువతలో విపరీతమైన క్రేజ్ సంపాదించుకుంది. ఇటీవల కొన్ని సినిమాలు ఆశించిన స్థాయిలో విజయం సాధించకపోయినప్పటికీ, ఈ అమ్మడికి టాలీవుడ్‌తో పాటు ఇతర పరిశ్రమల్లోనూ వరుస అవకాశాలు క్యూ కడుతున్నాయి. ప్రస్తుతం కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ 'D-55' ప్రాజెక్ట్‌తో పాటు, బాలీవుడ్‌లో కార్తీక్ ఆర్యన్ సరసన 'ఆషికీ-3' చిత్రంలో నటిస్తూ బిజీగా ఉంది. భాషా భేదాలు లేకుండా ఇండియన్ సినిమాలో దూసుకుపోతున్న శ్రీలీల...

తాజాగా భాష, సంస్కృతిపై చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. వివిధ చిత్ర పరిశ్రమల్లో పనిచేయడంపై ఆమె మాట్లాడుతూ.. "నేను ప్రతి భాషను ఎంతో గౌరవిస్తాను. ప్రస్తుతం నాలుగు, ఐదు భాషల్లో ప్రాజెక్టులు చేస్తున్నాను. నేను ఏ కొత్త ప్రాంతానికి వెళ్లినా, స్టేజ్ పైన ఉన్నంతసేపూ అక్కడి స్థానిక భాషలోనే మాట్లాడటానికి ప్రయత్నిస్తాను. ఆ ప్రాంత ప్రజలకు, వారి సంస్కృతికి నేను ఇచ్చే కనీస గౌరవం అది" అని స్పష్టం చేసింది. పబ్లిక్ ఈవెంట్స్‌లో స్థానిక భాషలో మాట్లాడటం వల్ల ప్రేక్షకులకు, సెలబ్రిటీలకు మధ్య ఉన్న దూరం తగ్గి, ఒక మంచి అనుబంధం ఏర్పడుతుందని శ్రీలీల అభిప్రాయపడింది. ఇది కేవలం సినిమా పబ్లిసిటీ కోసం చేసే పని కాదని, మనకు గుర్తింపునిచ్చిన ఆయా ప్రాంతాల ఐడెంటిటీని గౌరవించడమేనని తెలిపింది.

# రెంటల్ విధానంలోనే 'పెద్ది'.. చిరంజీవి జోక్యంతో సద్దుమణిగిన వివాదం



అగ్ర నటుడు చిరంజీవితో తెలంగాణ ఎగ్జిబిటర్ల సమావేశం ముగిసింది. ఈ భేటీలో సినీ పరిశ్రమలో పర్సంటేజీల వివాదం సద్దుమణిగింది. చిరంజీవి జోక్యంతో పర్సంటేజీ నిర్ణయం వాయిదా పడింది. జూన్ 4న విడుదల కానున్న 'పెద్ది' (Peddi) సినిమాను రెంటల్ విధానంలోనే ప్రదర్శించాలని ఎగ్జిబిటర్లు నిర్ణయించారు. జూన్ 30 తర్వాత విడుదలయ్యే చిత్రాలకు పర్సంటేజీ విధానం వర్తింపజేస్తామన్నారు. ఈ మేరకు తెలంగాణ ఎగ్జిబిటర్లు తీసుకున్న నిర్ణయంపై చిరంజీవి హర్షం వ్యక్తం చేశారు. ఫిల్మ్ ఛాంబర్ కమిటీ నివేదిక మేరకు నడుచుకోవాలని సూచించారు.

**ఆ రోజు నుంచి పర్సంటేజీ విధానంలోనే..**

చిరంజీవితో భేటీ ముగిసిన అనంతరం.. ఎగ్జిబిటర్ల తరఫున తెలంగాణ స్టేట్ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెస్‌నోట్ విడుదల చేసింది. జూన్ 30లోగా పర్సంటేజీ సమస్యను పరిష్కరిస్తానని చిరంజీవి హామీ ఇచ్చారని చెప్పింది. జులై 3 నుంచి కొత్త పర్సంటేజీ విధానం అమలు కానుందని తెలిపింది. ఆ రోజు నుంచి రెంటల్ సిస్టమ్ ఉండదని, పర్సంటేజీ విధానంలోనే సినిమాల ప్రదర్శన ఉంటుందని స్పష్టం చేసింది.

సినిమా

# రణ్‌వీర్ 'డాన్ 3' వివాదం వేళ.. తెర పైకి దీపిక 'రేస్ 2'



ప్రస్తుతం ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది 'డాన్ 3' చిత్రం. దీనిచుట్టూ కొనసాగుతున్న చర్చల మధ్య రణ్‌వీర్ భార్య, నటి దీపికా పదుకొణెకు సంబంధించిన పాత వివాదం మరోసారి సోషల్ మీడియాలో చర్చనీయాంశమైంది. 2012లో జరిగిన 'రేస్ 2' ఘటనను నెటిజన్లు గుర్తుచేసుకుంటున్నారు. 'రేస్ 2' షూటింగ్ సమయంలో దీపికా పదుకొణె ప్రవర్తనపై నిర్మాత రమేశ్ తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేసిన విషయం అప్పట్లో బాలీవుడ్‌లో సంచలనం సృష్టించింది. ఆరు రోజుల షూటింగ్ అనంతరం ఆమె అకస్మాత్తుగా సినిమా నుంచి వైదొలగారని ఆయన ఆరోపించారు. ఆమె డేట్స్‌కు అనుగుణంగా షూటింగ్ షెడ్యూల్స్ మార్చాల్సి వచ్చిందన్నారు. అయినా చివరి నిమిషంలో ప్రాజెక్ట్ నుంచి వైదొలగడం వల్ల యూనిట్‌కు ఇబ్బందులు ఎదురయ్యాయని ఆయన పేర్కొన్నారు. అలాగే సమావేశాలకు హాజరుకాకపోవడం, ఫోన్ కాల్స్, మెసేజ్‌లకు స్పందించలేదని ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. "నా 25 ఏళ్ల సినీ ప్రయాణంలో ఇలాంటి పరిస్థితి ఎప్పుడూ ఎదురుకాలేదు" అంటూ ఆమె వ్యవహార శైలిపై తీవ్ర ఆరోపణలు చేశారు. ఆమెకు వృత్తిపై అంకితభావం లేదన్నారు. ఆ సినిమా నుంచి దీపిక వైదొలగడంతో చిత్రబృందం ఆమెపై సినీ సంఘాలకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమైంది. తనకు ఇంతకుమించిన మార్గం లేదని నిర్మాత అప్పట్లో మీడియాతో వెల్లడించారు. దీంతో దీపిక నిర్మాతలతో చర్చలు జరిపి తిరిగి ప్రాజెక్ట్‌లో భాగమయ్యారు. అయితే కొత్త నిబంధనలతో ఆమె 'రేస్ 2' పూర్తి చేశారు. 2013లో విడుదలైన ఈ సినిమా కమర్షియల్ హిట్‌గా నిలిచింది. ప్రస్తుతం 'డాన్ 3' చర్చల మధ్య ఈ పాత వివాదం మళ్లీ వెలుగులోకి రావడం బాలీవుడ్‌లో ఆసక్తికరంగా మారింది. రణ్‌వీర్ సింగ్ బ్యాన్‌పై 'ఫెడరేషన్ ఆఫ్ వెస్ట్రన్ ఇండియా సినీ ఎంప్లాయీస్' (ఎఫ్‌డబ్ల్యూఐసీఈ) చీఫ్ అడ్వైజర్ తాజాగా స్పష్టతనిచ్చారు. అది అధికారిక బ్యాన్ కాదని స్పష్టంచేశారు. నటులపై నిషేధం విధించే అధికారం తమకు లేదని తెలిపారు. సమస్యకు పరిష్కారం లభించేవరకూ ఆయనతో కలిసి పని చేయొద్దని ఎఫ్‌డబ్ల్యూఐసీఈ సభ్యులను ఆదేశించామన్నారు. దీంతో రణ్‌వీర్ 'డాన్ 3' బృందంతో చర్చలు జరిపి కొత్త నిబంధనల ప్రకారం ఆ సినిమాలో నటించే అవకాశం ఉన్నట్లు బీటౌన్ మీడియా పేర్కొంది.

# ట్రోలర్లకు జగపతి బాబు స్ట్రాంగ్ కౌంటర్!





గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ హీరోగా, ఉప్పెన ఫేమ్ బుచ్చిబాబు సానా దర్శకత్వంలో వస్తున్న పాన్ ఇండియా చిత్రం 'పెద్ది'. భారీ అంచనాల నడుమ జూన్ 4న విడుదల కానున్న ఈ సినిమా ప్రమోషన్లలో చిత్ర బృందం చురుగ్గా పాల్గొంటోంది. ఈ క్రమంలో రామ్ చరణ్ ప్రవర్తనపై సోషల్ మీడియాలో జరుగుతున్న ట్రోలింగ్‌పై సీనియర్ నటుడు జగపతి బాబు తీవ్రంగా స్పందించారు. పనిలేని వాళ్లే ఇలాంటి విమర్శలు చేస్తుంటారని, హీరోల కష్టాన్ని గుర్తించాలని ఆయన హితవు పలికారు. 'పెద్ది' సినిమా ప్రమోషన్లలో భాగంగా దేశవ్యాప్తంగా పర్యటిస్తున్న రామ్ చరణ్, కొన్ని ఈవెంట్లలో కొందరి పేర్లు మర్చిపోవడం, బెంగళూరులో కొద్దిగా కన్నడలో మాట్లాడటం వంటి అంశాలపై సోషల్ మీడియాలో కొందరు ట్రోలింగ్ చేస్తున్నారు. ఈ విమర్శలపై తాజాగా మీడియాతో మాట్లాడిన జగపతి బాబు, వారికి గట్టిగా కౌంటర్ ఇచ్చారు. "ట్రోలింగ్ చేసే వాళ్లను నేను పట్టించుకోను. పనిలేని వాళ్లు ఎవరినైనా కిందికి లాగాలనే ఉద్దేశంతో ఇలాంటివి చేస్తుంటారు. ఈ సినిమా కోసం చరణ్ ఎంత కష్టపడ్డాడో, ఎన్ని గాయాలపాలయ్యాడో ఎవరూ చూడరు. ఇలాంటి చిన్న విషయాలను పట్టుకుని పెద్దవిగా చేయడం సరికాదు" అని అన్నారు. ఒక పెద్ద సినిమా విడుదల సమయంలో హీరోలపై ఉండే తీవ్రమైన ఒత్తిడిని కూడా ఆయన వివరించారు. "ఒకవైపు డబ్బింగ్ పనులు, మరోవైపు పోస్ట్ ప్రొడక్షన్, సెన్సార్, థియేటర్ల వ్యవహారాలు.. ఇలా ఒకేసారి ఎన్నో బాధ్యతలు ఉంటాయి. ఆ ఒత్తిడిలో చిన్న చిన్న విషయాలు మర్చిపోవడం చాలా సహజం. నేను కూడా ఎన్నోసార్లు మర్చిపోతాను. వాటిని పట్టుకుని రాద్ధాంతం చేయడం సరైన పద్ధతి కాదు" అని ఆయన స్పష్టం చేశారు. గతంలో తనపై కూడా ఇలాంటి ఫేక్ ప్రచారం జరిగిందని జగపతి బాబు గుర్తుచేసుకున్నారు. "ఒక సీన్ కోసం నేను 70-80 టేకులు తీసుకున్నానని సోషల్ మీడియాలో ప్రచారం చేశారు. అందులో ఎలాంటి వాస్తవం లేదు. నేను మహా అయితే మూడు టేకులు తీసుకుని ఉంటాను. పూర్తిగా అవాస్తవాలతో నాపై కూడా ట్రోలింగ్ చేశారు" అని తన అనుభవాన్ని పంచుకున్నారు.



# రామ్ చరణ్ ధరించిన వాచ్ ఖరీదు తెలిస్తే షాక్!

హైదరాబాద్: గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ లగ్జరీ లైఫ్ స్టైల్ ఇప్పుడు నెట్టింట హాట్ టాపిక్‌గా మారింది. తాజాగా ఒక పబ్లిక్ ఈవెంట్‌కు ఆయన హాజరైన తీరు, ఆ సందర్భంగా వినియోగించిన విలాసవంతమైన వాహనం, చేతికి ధరించిన ఖరీదైన వాచ్ అభిమానులను ఆశ్చర్యానికి గురిచేస్తున్నాయి.

**రోడ్డుపై ప్రైవేట్ జెట్:** ఈ ఈవెంట్ కోసం రామ్ చరణ్ సరికొత్త 'లెక్సస్ ఎల్ఎం 350హెచ్' అల్ట్రా లగ్జరీ కారులో వచ్చారు. దీని ధర సుమారు రూ. 3 కోట్లు. విమానంలో ఉండే సౌకర్యాలకు ఏమాత్రం తీసిపోని విధంగా, ఇందులో 48 అంగుళాల వైడ్‌స్క్రీన్ టీవీ, ప్రత్యేక రిఫ్రిజిరేటర్, ప్రైవసీ కోసం పటిష్టమైన పార్టిషన్లు ఉండటంతో దీనిని 'రోడ్డుపై వెళ్లే ప్రైవేట్ జెట్'గా అభివర్ణిస్తున్నారు.

**కోట్ల విలువైన వాచ్:** వాహనం ఎంతటి విలాసవంతమో, ఆయన ధరించిన వాచ్ అంతకంటే ప్రత్యేకం. రామ్ చరణ్ చేతికి ఉన్న 'రిచర్డ్ మిల్లె' వాచ్ ధర దాదాపు రూ. 2.7 కోట్లకు పైమాటేనని అంచనా. అత్యున్నత సాంకేతికతతో కూడిన ఈ అరుదైన వాచ్‌లను ప్రపంచంలో అతికొద్ది మంది మాత్రమే ధరిస్తుంటారు. కారు ధర, వాచ్ ధర దాదాపు సమానంగా ఉండటం గమనార్హం.



# ఆ మాట చెప్పడానికి నేను భయపడను: దిల్ రాజు

ప్రస్తుతం ఇండస్ట్రీ చాలా క్లిష్టపరిస్థితుల్లో ఉందని నిర్మాత దిల్ రాజు తెలిపారు. తాను ఈ మాట చెప్పడానికి భయపడనన్నారు. 'సమ్మర్ హాలీడేస్' సినిమా టీజర్ లాంచ్ ఈవెంట్‌కు దిల్ రాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కొత్త వాళ్లతో సినిమా చేస్తే విజయం వస్తుందని తాను నమ్ముతానంటూ.. సమ్మర్ హాలీడేస్ మంచి హిట్ కావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఇండస్ట్రీని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ''ఇండస్ట్రీ ప్రస్తుతం చాలా కష్టకాలంలో ఉందని చెప్పడానికి చాలా మంది భయపడతారు. నేను ఈ విషయాన్ని ధైర్యంగా చెప్పగలను. ప్రేక్షకులను థియేటర్‌లకు తీసుకురావడమే మనందరికీ ఇప్పుడు సవాల్. సమ్మర్ హాలీడేస్ లాంటి సినిమాలు తీసి ఆడియన్స్‌ను థియేటర్‌కు తీసుకురండి. అప్పుడు ఆటోమేటిక్‌గా మంచి సినిమాలు నిలబడతాయి. చిన్న సినిమాలతో డైరెక్టర్లు అందరూ మంచి పేరు తెచ్చుకుంటున్నారు. కొత్త దర్శకులందరూ మంచి చిత్రాలు తీసి ఇండస్ట్రీని నిలబెట్టండి. చిన్న సినిమాలు ఎంత విజయం సాధిస్తే ఇండస్ట్రీ అంత బాగుంటుంది'' అని అన్నారు. ''చాలా రోజుల తర్వాత ఒక ఈవెంట్ ఇంత సంతోషంగా జరగడం చూస్తున్నాను. ఈ విషయంలో నిర్మాతలను అభినందించాలి. ఎందుకంటే ఈ మధ్యకాలంలో ఏ ఈవెంట్ కూడా ఇంత అద్భుతంగా జరగలేదు. థియేటర్‌లలో కూడా సందడి కనిపించడం లేదు. ఈ 'సమ్మర్ హాలీడేస్'తో థియేటర్‌లలో సందడి నెలకొనాలని కోరుకుంటున్నా'' అని దిల్‌రాజు తెలిపారు.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.